
సంతాన లక్ష్మీగా.. భక్తులకు దర్శనం

» నేడు గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు



భద్రాచలం, సెప్టెంబరు 24 : భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దేవీ శరన్ననవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీతాయారు అమ్మవారు సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు అమ్మవారికి ప్రత్యేక స్నపనం నిర్వహించి అష్టోత్తరం, సామూహిక కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే చిత్రకూట మండపంలో రెండో రోజు శ్రీ రామాయణ పారాయణం కొనసాగుతోంది. కాగా.. గురువారం గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో దామోదర్‌రావు, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు కురిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, శ్రీరామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.



రామాలయం మాస్టర్‌ప్లాన్‌పై సమాలోచనలు

» ఆర్కిటెక్‌తో దేవస్థానం ఈవో, వైదిక సిబ్బంది భేటీ

భద్రాచలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి రామాలయ అభివృద్ధి పనుల మాస్టర్ ప్లాన్‌పై బుధవారం దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, వైదిక సిబ్బంది ఆర్కిటెక్ సూర్యనారాయణతో దేవస్థానం కార్యాలయంలో చర్చించారు. ఈ సందర్భంగా మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా చేపట్టాల్సిన పలు నిర్మాణాలపై చర్చించారు. అలాగే వైదిక సిబ్బంది పలు సూచనలు చేశారు. వాటికి అనుగుణంగా మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరచనున్నట్లు సూర్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణ, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు అమరవాది గోపాలకృష్ణమాచార్యులు, కోటి రామస్వరూప్, వేద పండితులు గుదిమెళ్ల మురళీ కృష్ణమాచార్యులు, సీసీ టూ ఈవో శ్రీనివాసరెడ్డి, ఏఈ అజయ్ పాల్గొన్నారు.

శరవేగంగా..


నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు

- జిల్లాలో ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- లబ్ధిదారులకు ఇప్పటికే రూ. 130కోట్ల చెల్లింపు
- మొత్తం 16,441 ఇళ్ల మంజూరు
- 13,591 ఇళ్లకు మార్కింగ్.. 1,291 గృహాలకు స్లాబులు
- రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతమ్ నిరంతర పర్యవేక్షణతో చురుగ్గా పనులు

ఖమ్మం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

గృహ నిర్మాణంలో జిల్లా మొదటిస్థానం



బి. శ్రీనివాస్, గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో లబ్ధిదారులకు రూ.130కోట్లు వారి ఖాతాలకు జమ చేశాం. పునాదుల వరకు రూ.లక్ష, గోడలు పూర్తయితే మరో లక్ష, స్లాబుకు రూ.2లక్షలు, మొత్తం ఇల్లు పూర్తిచేస్తే మిగతా రూ.లక్ష.. మొత్తం రూ.5లక్షలు వారి ఖాతాల్లో జమవుతాయి. ఎక్కడా దళారుల ప్రమేయం కాని, అవినీతికి అవకాశం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. జిల్లాలో మొత్తం 16,441 ఇళ్లు మంజూరైతే 1291 ఇళ్లకు స్లాబులు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లను కూడా త్వరగా పూర్తి చేస్తాం.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం జిల్లాలో చురుగ్గా సాగుతోంది. జిల్లా నుంచి రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండగా.. జిల్లాలో మొత్తం 16,441ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో ఇప్పటికే 13,591 ఇళ్లకు మార్కింగ్ చేయగా.. 7,430 ఇళ్లు బేస్‌మట్టం వరకు పూర్తయ్యాయి. 2,580 స్లాబు గోడల వరకు, 1291 ఇళ్లకు స్లాబులు పూర్తిచేయగా, 12ఇళ్లు పూర్తయి గృహప్రవేశాలు కూడా చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఇప్పటికే రూ.130కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమచేసింది. దీంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని గృహనిర్మాణశాఖ అధికారులు చెబుతున్నారు. ఖమ్మం జిల్లా నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, గృహనిర్మాణశాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉండగా.. గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటికి సొంత జిల్లా కావడంతో ఇందిరమ్మ ఇళ్ల నిధులు కేటాయింపు త్వరితగతిన జరుగుతున్నాయి. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన వీపీ గౌతమ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఎండీగా వ్యవహరిస్తున్నారు. దీంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఆయన కూడా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుండటంతో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.



నియోజకవర్గాల వారీగా..

- ఖమ్మం నియోజకవర్గంలో 3,285 ఇళ్లు మంజూరవగా.. 1,823 ఇళ్లకు మార్కింగ్ చేశారు. ఇందులో 883 ఇళ్లు పునాదుల వరకు నిర్మించగా.. 82ఇళ్లు గోడలు పూర్తయ్యాయి. మరో 18 ఇళ్లకు స్లాబులు పూర్తి చేశారు.
- పాలేరు నియోజకవర్గంలో 3,483 మంజూరవగా.. 3,105 ఇళ్లకు ముగ్గులు పోశారు. 1,507 ఇళ్లు పునాదుల వరకు నిర్మించగా గోడల వరకు 830, స్లాబులు వరకు 441 ఇళ్లు నిర్మించారు. 6 ఇళ్లు పూర్తయ్యాయి.
- మధిర నియోజకవర్గంలో 2,792 ఇళ్లు ఇప్పటి వరకు మంజూరవగా.. 2,526 ఇళ్లకు ముగ్గులు పోశారు. పునాదుల వరకు 1,805 ఇళ్లు పూర్తవగా, 157 గోడల వరకు, 113 ఇళ్లు స్లాబుల వరకు పూర్తయ్యాయి.
- సత్తుపల్లి నియోజకవర్గానికి 3,426 ఇళ్లు మంజూరవగా, 3147 ఇళ్లకు ముగ్గులు పోశారు. పునాదుల వరకు 1,428, గోడల వరకు 1,033, స్లాబుల వరకు 493 ఇళ్లు పూర్తి చేశారు.
- వైరా నియోజకవర్గంలో 2,923 ఇళ్లు మంజూరవగా.. 2,531 ఇళ్లకు ముగ్గులు పోశారు. పునాదుల వరకు 1,580 ఇళ్లు, గోడల వరకు 400, స్లాబుల వరకు 183 పూర్తయ్యాయి. అలాగే మరో ఆరు ఇళ్లు పూర్తిచేశారు.
- ఇవి కాకుండా జిల్లా పరిధిలో ఉన్న ఇల్లెందు నియోజకవర్గంలోని కామేపల్లి మండలంలో 532 మంజూరవగా, 459 ఇళ్లకు ముగ్గులు పోశారు. 227 గృహాలకు పునాదులు పూర్తవగా.. 70 ఇళ్లకు గోడలు, 43 స్లాబులు పూర్తయ్యాయి.

ఇందిరమ్మ ఇళ్లు.. పేదల ఆత్మగౌరవానికి ప్రతీకలు

- రైతును రాజు చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఖమ్మం రూరల్ మండలంలో పర్యటన


ఆరెంపుల గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం చేయిస్తున్న మంత్రి పొంగులేటి, కలెక్టర్, సీపీ

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు పేదల ఆత్మగౌరవానికి ప్రతీకలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రైతును రాజు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. బుధవారం ఆయన ఖమ్మం రూరల్ మండలంలో పర్యటించారు. ఆరెంపుల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అధికారం, స్వార్థం కోసం కాకుండా పేద ప్రజల ఆత్మగౌరవం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గృహనిర్మాణ శాఖను తనకు కేటాయించారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో దివంగత నేత వైఎస్‌ఆర్ హయాంలో 25లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తే.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో గత పాలకులు హౌసింగ్ కార్పొరేషన్‌ను రద్దు చేశారని విమర్శించారు. గత పాలకులు ధనార్జన కోసం చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వారి హయాంలోనే కూలిపోయిందన్నారు. గత పాలకులు చేసిన భారీ అప్పులు, కుదేలైన ఆర్థిక వ్యవస్థ ఉన్న సమయంలో తమ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ పేద ప్రజలకు ఇచ్చిన మాట మేరకు మొదటి విడతలోనే ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3,500 చొప్పున రాష్ట్రంలో మొత్తం 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ ఇళ్లు నిర్మించుకునే పేదలు ఎక్కడా ఇబ్బంది పడకుండా ప్రతీ సోమవారం డబ్బులు విడుదల చేస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతంలో సీఎం చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం జరిగిందని, తర్వాత రాష్ట్రంలోనే పాలేరు నియోజకవర్గంలో గృహ ప్రవేశాలు చేయించాని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల లోపు మరో మూడు విడతల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నామన్నారు. ఆరెంపుల గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారురాలు చిర్రా రాజ్యం ఇంట్లో మంత్రి పొంగులేటి కలెక్టర్, సీపీలతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఎం వెంకటాయపాలెం గ్రామంలో 5 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో, రూ. 15 కోట్లతో నిర్మించనున్న శీతల గోదాములకు శంకుస్థాపన చేశారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత పదేళ్లలో గత పాలకులు గిడ్డంగుల సామర్థ్యం రూ.3 లక్షల మెట్రిక్ టన్నులు పెంచితే.. తమ ప్రజా ప్రభుత్వం రూ.5లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల గోదాముల నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. రాబోయే మూడేళ్లలో వీటిని పూర్తి చేస్తామన్నారు. గిడ్డంగుల సంస్థ ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా మొట్టమొదటి సారిగా జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ గా కోల్డ్ స్టోరేజ్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. 9700 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ కోల్డ్ స్టోరేజ్‌ను రూ.15కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వల్ల యూరియా సమస్య ఏర్పడిగే ఢిల్లీలో రైతుల పక్షాన పోరాటం చేసి రైతులకు యూరియా సరఫరా చేశామని (మిగతా 8వ పేజీలో)



గ్రామీణ రోడ్లకు రూ.2కోట్లు విడుదల

» వానలకు దెబ్బతిన్న రహదారుల పునర్నిర్మాణానికి ఎన్నార్‌ఈజీఎస్ కింద నిధులు


ఏన్కూరు సమీపంలో దెబ్బతిన్న కల్వర్టు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామీణ రహదారులు ఛిద్రమమ్యాయి. పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతిన్నాయి. ఖమ్మం డివిజన్ పరిధిలోని సత్తుపల్లి మండలాల్లో, మధిర నియోజకవర్గంలో పలు మండలాల్లో రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. ఈ మేరకు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ రోడ్ల పునరుద్ధరణకు గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద రూ.2.05కోట్లు విడుదల చేశారు. ఈ నిధులను పంచాయతీరాజ్ గ్రామీణ రోడ్ల మరమ్మతులకు వినియోగించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. ఈ క్రమంలో తాము రోడ్ల తాత్కాలిక పునరుద్ధరణకు ఈ నిధులను వినియోగించనున్నామని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. మొత్తం 26 పనులను చేపట్టనున్నామని వాటిలో సత్తుపల్లిలో ఒకటి, పెనుబల్లి మండలంలో10 రోడ్లకు, బోనకల్‌లో ఒకరోడ్డు, ముదిగొండ, నాగులవంచ, లచ్చగూడెంలో ఒక్కో రోడ్డు, సింగరేణి మండలం గాదెపాడులో ఒకటి, కూసుమంచి మండలంలో రెండు, రఘునాథపాలెంలో ఒకటి, ఎర్రుపాలెంలో ఐదు రోడ్లకు నిధులు కేటాయించారని తెలిపారు. అలాగే ఏన్కూరు మండలంలో ధ్వంసమైన కల్వర్టుకు రూ.20లక్షలు ఇచ్చారన్నారు.

అవినీతికి మళ్లీ అవకాశాలు!

- పెరిగిన అధికారులు.. తగ్గిన పారిశుధ్య చర్యలు
- ఆదాయ సేకరణలో జాప్యం.. ఆపై గోప్యం
- నేడు కేఎంసీపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్ష



వివరాలు 7లో..

అంతా గోప్యంగా..



- జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తి
- కలెక్టర్, ఇన్‌చార్జ్ డీఈవోకు తప్పుడు నివేదికలు అందించిన విద్యాశాఖ
- అవసరం లేని చోటుకు ఓకే.. అవసరమున్న చోటుకు నో!
- మండలాలు దాటి నగరానికి కేటాయింపు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ అంతా గోప్యంగా సాగింది. జిల్లా వ్యాప్తంగా 311 మంది ఉపాధ్యాయులను అవసరమైన వివిధ పాఠశాలలకు సర్దుబాటు చేయగా.. వారిలో సుమారు 200 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు ఉండగా.. మిగతా 100 మంది వివిధ సబ్జెక్టుల టీచర్లున్నారు. కలెక్టర్ చైర్మన్‌గా, డీఈవో సభ్యుడి గా ఉన్న కమిటీ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరిగింది. కానీ కలెక్టర్, ఇన్‌చార్జ్ డీఈవో, అదనపు కలెక్టర్‌కు విద్యాశాఖ అధికారులు తప్పుడు నివేదకలు ఇచ్చారని, వాటికి కమిటీ ఆమోదించిందని పలు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపిస్తున్నాయి. తప్పుడు నివేదికలతో నిబంధనలకు విరుద్ధంగా సర్దుబాటుకు యత్నించిన అధికారులపై కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ సర్దుబాట్లను నిలిపేసి పారదర్శకంగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి. సర్దుబాటు ప్రక్రియ పై విద్యాశాఖ ఇచ్చిన మార్గదర్శకాల ప్రకా రం జిల్లాలో సర్దుబాటు ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా కొన్ని సర్దుబాట్లు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నుంచి విమర్శలు (మిగతా 8వ పేజీలో)

రిజర్వేషన్లపై తుది కసరత్తు!



- అత్యంత గోప్యంగా ప్రక్రియ నిర్వహణ
- స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నివేదిక
- జడ్పీటీసీల్లో బీసీలకు 8, ఎస్సీలకు 4, ఎస్టీలకు 4, ఇతరులకు 4 దక్కే అవకాశం
- ఎంపీపీల్లో బీసీలకు ఎక్కువ ఛాన్స్

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో కీలకమైన రిజర్వేషన్ల కేటాయింపుపై అధికారులు తుది కసరత్తు చేశారు. సోమ, మంగళవారాల్లో కుస్తీలు పట్టిన అధికారులు బుధవారం మధ్యాహ్నానికి ఖరారు చేసినట్లు తెలిసింది. జిల్లాలో 20జడ్పీటీసీలకు, 20 ఎంపీపీలకు రిజర్వేషన్ల ప్రక్రియను కలెక్టర్ ఖరారు చేయగా.. ఎంపీటీసీలు, పంచాయతీలకు ఆర్డీవోలు, వార్డు మెంబర్లకు రిజర్వేషన్లను ఎంపీడీవోలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్న లక్ష్యంతో వీటిని అత్యంత గోప్యంగా పకడ్బందీగా చేయాలంటూ కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో మూడు రోజులుగా జిల్లాపరిషత్ కార్యాలయంలో జడ్పీ సీఈవో , డిప్యూటీ సీఈవో, ఖమ్మం, కల్లూరు ఆర్డీవోలు, డీపీవో, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు అంతా కలిసి రిజర్వేషన్లను ఖరారు చేసి సీల్డ్ కవర్‌లో కలెక్టర్‌కు అందించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత రిజర్వేషన్లను అధికారికంగా వెల్లడించనున్నట్లు తెలుస్తోంది. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వర్తింపజేస్తుండటంతో ఈ సారి స్థానాలు తారుమారయ్యే ఆస్కారం కల్పిస్తోంది.

రిజర్వేషన్లు ఉండనున్నాయిలా (అంచనా)..

జిల్లాలో 20జడ్పీటీసీ స్థానాల్లో బీసీలకు 8, ఎస్సీలకు 4, ఎస్టీలకు 4 ఇతరులకు 4 చొప్పున రిజర్వేషన్లు ఉండనున్నట్లు తెలుస్తోంది. అయితే జడ్పీ స్థానం మాత్రం ప్రభుత్వం రొటేషన్ పద్ధతిలో కేటాయించనున్నట్లు తెలుస్తోంది. గతంలో బీసీలకు, 2019లో ఎస్సీలకు కేటాయించింది. ఈ సారి జనరల్‌కు కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 2019లో జడ్పీటీసీల్లో ఎస్సీలకు 4, ఎస్టీలకు 4, బీసీలకు 2, ఇతరులకు 10 స్థానాలు కేటాయించారు. అయితే ఈ సారి దీనికి భిన్నంగా రిజర్వేషన్ల అమలు ఉండనున్నట్లు (మిగతా 8వ పేజీలో)

గంజాయి రవాణా నిందితుల ఆస్తులు జప్తు

- చెన్నై కాంపిటీటివ్ అథారిటీ ఉత్తర్వులతో చర్యలు
- ఆస్తుల విలువ రూ.23,52,116


గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు(ఫైల్)

పినపాక, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా నిందితుల ఆస్తులను కొత్తగూడెం పోలీసులు జప్తు చేశారు. వీటి విలువ రూ.23,52,116 ఉంటుందని వెల్లడించారు. గత ఏడాది జూన్29న గంజాయి రవాణా చేస్తూ, ఏడూళ్లబయ్యారం పోలీసులకు చిక్కిన సదరు నిందితులు చిక్కారు.వీరి సంబంధించిన ఆస్తులను జప్తు చేశారు. వీటితో పాటు, నిందితుల ప్రమేయంతో బంధువుల వద్దనున్న ఆస్తులను సైతం జప్తు చేసినట్లు ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వరరావు బుధవారం వెల్లడించారు. చెన్నై కాంపిటీటివ్ అథారిటీ ఆదేశాలతో నేరాలకు పాల్పడిన వ్యక్తుల ఆస్తుల జప్తునకు ఉత్తర్వులు ఇచ్చినట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం, అమర్‌సింగ్‌తండాకు చెందిన జాటోత్ విజయ్, జాటోత్ భాస్కర్, జాటోత్ సురేష్, అదేజిల్లా దుబ్బతండాకు చెందిన నునావత్ గణేష్‌కు చెందిన మూడు ఇళ్లు, కారు, ట్రాక్టరు, ఆటో, నాలుగు మోటార్ సైకిళ్లను చెన్నై కాంపిటీటివ్ అథారిటీ ఉత్తర్వుల మేరకు ఆస్తులను జప్తు చేశామన్నారు. వీటి విలువ రూ.23,52,116 లక్షలు అని వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా గంజాయి రవాణాను చేధించడంతోపాటు, నిందితులకు తగు శిక్షపడి, ఆస్తుల జప్తుకు కృషి చేసిన ఏడూళ్లబయ్యారం సీఐ వెంకటేశ్వరరావును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ప్రత్యేకంగా అభినందించారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

- ఏఎస్పీ జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు
- కొత్తగూడెంలో వివిధ ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- ఐక్యత చాటిన ఆదివాసీ సంఘాలు


మాట్లాడుతున్న ఏఎస్పీ జాతీయ అధ్యక్షుడు నాగేశ్వరరావు

కొత్తగూడెంపోస్టాఫీస్‌సెంటర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ (ఏఎస్పీ) జాతీయ అధ్యక్షుడు దాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో బుధవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. ప్రకాశం మైదానం నుంచి ప్రారంభమై అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి కొత్తగూడెం క్లబ్ వరకు నిర్వహించారు. ఏఎస్పీ తుడుందెబ్బ, ఆదివాసీసేన, జీఎస్ఎస్ ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్, టీచర్స్ ఫెడరేషన్, ఆదివాసీ విద్య సంక్షేమపరిషత్,ఉద్యోగసంక్షేమ సంఘం, విద్యార్థి సంఘం నాయకులు ఐక్యతను చాటుతూ ఈ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన సభలో జాతీయ అధ్యక్షుడు మాట్లాడుతూ... అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని తొమ్మిది ఆదిమ తెగలకు మాత్రమే ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. అందులో కోయ, గోండు, కోలాం,పర్ధాన్, నాయక్‌పోడ్, చెంచు, అంధ్, తోటి, కొండారెడ్డి ఉన్నట్లు వివరించారు. 1/70, ఆర్ఓఎఫ్ఆర్, పెసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, ఏజెన్సీలలో 29శాఖలను కలుపుతూ జీవో నెంబర్ 3ను చట్టం చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని 29 శాఖల ఎంపిక అధికారం ఐటీడీఏలకు ఇవ్వాలని, ఆదివాసీలందరికీ పోడు భూమి పట్టాలు తక్షణమే మంజూరు చేసి అందజేయాలన్నారు. తెలంగాణలో హైకోర్టులో ఉన్న కేసు నెంబర్ 5641/2011 వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ జాతీయ గౌరవ అధ్యక్షుడు మల్లెల కృష్ణ కోశాధికారి కొర్స వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఊకే శంకర్, రాష్ట్ర అధ్యక్షుడు పూణెం శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు, తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు బండారి సూర్యనారాయణ, ఆదివాసీసేన రాష్ట్ర సెక్రటరీ శెట్టిపల్లి శ్రీనివాస్, ఏటీఏ స్టేట్ ప్రెసిడెంట్ కల్లూరి జయబాబు, ఏటీఎఫ్‌స్టేట్ ప్రెసిడెంట్ మోకాళ్ల శ్రీనివాస్, ఏటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విద్యా శ్రీనివాస్, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దారబోయిన రమేష్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నేటినుంచి భావనాప్రియ సాహితీ వేదిక వార్షికోత్సవం

భద్రాచలం,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): భావనాప్రియ సాహితి వేదిక ఎనిమిదేళ్ల సాహిత్యపు పండుగలు గురువారం నుంచి నాలుగు రోజుల పాటు భద్రాచలంలో నిర్వహించనున్నారు. ఇందుకు స్థానిక జీయర్ మఠం వేదిక కానుంది. ప్రముఖ కవి, రచయిత ఎన్‌సీహెచ్ చక్రవర్తి సాహిత్యంపై గురు, శుక్ర వారాల్లో విశ్లేషణలు ఉండనుండగా 27, 28 తేదీల్లో భావనాప్రియ వార్షికోత్సవాలు నిర్వహించనున్నారు.

అన్నం శ్రీనివాసరావుకు అచీవ్‌మెంట్ అవార్డు


అవార్డు అందిస్తున్న వెంకయ్యనాయుడు

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):అన్నం సేవాఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నం శ్రీనివాసరావుకు ఓ టీవి చానల్ 2025 అచీవ్‌మెంట్ అవార్డును అందించింది. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ సమక్షంలో ఈఅవార్డును అన్నం శ్రీనివాసరావుకు అందించారు.శ్రీనివాసరావు చేసిన సామాజిక సేవలకుగుర్తింపుగా ఈ అవార్డును అందించారు.

భూ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తాం: జేఏసీ

కొత్తగూడెం కలెక్టరేట్,సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట నియోజకవర్గంలోని రామన్నపేట ఆదివాసీల భూ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఆదివాసీ జేఏసీ నాయకులు పాయం సత్యనారాయణ, కొర్స వెంకటేష్ దొర, తంబాల రవి, గడ్డం వెంకటేష్, అరేం ప్రశాంత్, పూనెం నాగేశ్వరరావు, మడివి సరస్వతి హెచ్చరించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం వద్ద భూ సమస్యపై చేస్తున్న నిరవధిక నిరాహార దీక్ష శిబిరాన్ని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక (జేఏసీ) నాయకులు సంఘీభావం తెలిపారు. అశ్వారావుపేటమండల రామన్నగూడెం గ్రామ సర్వే నెం.30, 36, 39లో ఉన్న ఆదివాసీల పట్టా భూములను అటవీ, రెవెన్యూ శాఖల వారు జాయింట్ సర్వే నిర్వహించి ఆదివాసీల పట్టాభూములను అప్పగించాలని అన్నారు. లేనియెడల సమస్య పరిష్కరించేంత వరకు జిల్లావ్యాప్తంగా ఈఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం నిరవధిక దీక్ష చేస్తున్న ఆదివాసీలకు పాల్వంచ మండల తోగూడెం గ్రామపంచాయతీ ఆదివాసీ నాయకులు పులిహోర పొట్లాలను అందజేశారు. అనంతరం ఈకార్యక్రమంలో ఆదివాసీ సంఘాల జేఏసి నాయకులు నారాయణ, రామారావు, కెచ్చల రంగారెడ్డి, గోకినేపల్లి ప్రభాకర్‌రావు, నూపా భాస్కర్, కల్లూరి కిషోర్, వాసం బుచ్చిరాజు, కుంజా అరుణ, కంగాల భూ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి కలెక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే ఆదినారాయణ

నియోజకవర్గంలోని రామన్నపేట ఆదివాసీ భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ భద్రాద్రి కలెక్టర్‌ను కోరారు. బుధవారం ఆయన ఫోన్‌లో కలెక్టర్‌తో మాట్లాడారు. అటవీశాఖ, రెవెన్యూ శాఖ సంయుక్తంగా సర్వే నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు.


ఆదివాసీల దీక్ష శిబిరాన్ని సందర్శించి, మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు

ఆమరణ నిరాహార దీక్షకు మద్దతు

ఖమ్మంచర్చికాంపౌండ్,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): రేపు ధర్నాచౌక్‌వద్ద జాతీయ బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఆమరణ నిరాహారదీక్షకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ కేవీకృష్ణారావు తెలిపారు. బుధవారం ఖమ్మంలోని ఉద్యమకారుల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఈ సమావేశంలో జాతీయబీసీ సంక్షేమ సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి మననం శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో 78 సీట్ల భర్తీ

- 29 నుంచి రెండో విడత కౌన్సెలింగ్
- 2నుంచి తరగతులు
- ఖమ్మం కళాశాల ప్రిన్సిపాల్ శంకర్



ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2025-26 సంవత్సరానికి ఎంబీబీఎస్ ప్రవేశాలు మొదలయ్యినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ తెలిపారు. మొదటి విడత కౌన్సిలింగ్ పూర్తయిన తర్వాత జాతీయ కోటాలో 15సీట్లు భర్తీ కాగా స్టేట్ కోటాలో 63 సీట్లు మొత్తంగా ఇప్పటి వరకు 78 సీట్లు భర్తీ అయినట్లు తెలిపారు. రెండో విడత కౌన్సిలింగ్ ప్రక్రియ సెప్టెంబరు 29నుంచి మొదలవుతుందన్నారు. మొత్తం 100 సీట్లకు గాను మొదటి విడతలోనే 78సీట్లు భర్తీకావడం గమనార్హమన్నారు. అక్టోబరు 2 నుంచి ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రకటించిన రెండో ఏడాది ఎంబీబీఎస్ ఫలితాల్లో ఖమ్మం మెడికల్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. 96శాతం ఉత్తీర్ణులయ్యారని వీటిలో 46 మంది మొదటి శ్రేణిలో, 17 మంది విద్యార్థులు డిస్టెంక్షన్ ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం

పెద్దతండాలో ముగ్గురిపై కేసు నమోదు

ఖమ్మంరూరల్,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదు అయింది. పోలీసుల వివరాల ప్రకారం.. మంగళవారం రూరల్ తహసీల్దార్ పిల్లి.రాంప్రసాద్,ఆర్ఐప్రసాద్ సిబ్బంది కలిసి ఏదులాపురం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వస్థలాల పర్యవేక్షణకు వెళుతున్నారు. ఈక్రమంలో సర్వే నంబర్ 136 లోని ప్రభుత్వ భూమిలో పెద్దతండా గ్రామానికి చెందిన బానోతు కృష్ణ, బానోతు బాలాజీ, ఏదులాపురం గ్రామానికి చెందిన ఏపూరి తరుణ్ ఫెన్సింగ్ వేస్తున్నారు ఇదిగమనించిన రెవెన్యూ అధికారులు ప్రశ్నించారు. ఇది మా అసైన్‌మెంట్ భూమి అని చెప్పారు. అందుకు అసైన్మెంట్ పోను మిగిలిన ప్రభుత్వ భూమిని సర్వే చేసి గుర్తించాల్సిన ఉందని,అప్పటివరకు ఎలాంటి ఆక్రమణలు, ఫెన్సింగ్ వేయవద్దని తెలిపారు. దీంతో వారు రెవెన్యూ అధికారులపై పరుష పదజాలముతో దూషించారు. కానిస్టేబుల్ ఫోటోలు తీస్తుండగా అతనిని కూడా బెదిరించారు. ఈ భూమి మాది అని ఎవరైనా సరే ఈ భూమిపైకి వస్తే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు.తహసీల్దార్ రాంప్రసాద్ ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ రాజు కేసు నమోదు చేశారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధికి 11లోపు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మంఅర్బన్,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు అవసరమైన ఆర్థికసాయం అందించే అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకాన్ని అర్హులైన ఎస్సీవిద్యార్థులు నవంబరు 11లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఇన్‌చార్జ్ ఉపసంచాలకురాలు విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 35ఏళ్ల లోపు విద్యార్థులు, కుటుంబ వార్షిక ఆదాయం 5 లక్షలకు మించని వారు ఈపథకానికి అర్హులని తెలిపారు. టోఫెల్, ఐఎల్ట్స్ జీఆర్ఈ, జీమ్యాట్,పీటీఈ వంటి అర్హత పరీక్షలు ఉత్తీర్ణులు కావాలన్నారు.

సీఎంఆర్.. 98.6శాతం!

- పూర్తి కావచ్చిన గతేడాది వానాకాలం బియ్యం అప్పగింత
- యాసంగి ధాన్యమే మిగిలింది


మిల్లులో బియ్యాన్ని తనిఖీ చేస్తున్న డీఎం శ్రీలత (ఫైల్)

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతేడాది (2024-25) వానాకాలం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) సేకరణ 98.6శాతం పూర్తయ్యింది. దీనికోసం జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు దృష్టి సారించి లక్ష్యాన్ని చేదించారు. ఇక యాసంగి సీఎంఆర్‌కు సంబంధించి ఇప్పటికే 83శాతం పూర్తవ్వగా అక్టోబరు మొదటివారం వరకు దీన్ని కూడా పూర్తి చేసే లక్ష్యంతో పనిచేస్తున్నారు. జిల్లాలో రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తుండడంతో ప్రజల నుంచి రేషన్ బియ్యానికి డిమాండ్ వస్తోంది. గతేడాది వానాకాలం సీజన్‌లో సేకరించిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్లకు అప్పగించింది. తిరిగి సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించడంలో కొందరు మిల్లర్లు జాప్యం చేస్తుండడంతో వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. గత నెల గడువు ముగిసే సమయానికి కొంత బ్యాలన్స్ ఉన్నా సెప్టెంబరు 22 నాటికి 98శాతం పూర్తి చేశారు. గడువులోపు సీఎంఆర్ సేకరించాలన్న లక్ష్యంతో అధికార యంత్రాంగం తరచుగా మిల్లులను తనిఖీ చేస్తూ మిల్లర్లను ప్రోత్సహిస్తూ పని పూర్తి చేయించగలిగారు. జిల్లాలో వానాకాలంలో 2,95,609 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయించారు. వీటిలో 1,95,228.406 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు పంపిణీ చేశారు. ఇంకా 2,841.194 మెట్రిక్ టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉంది. అంటే ఈ సారి అత్యధికంగా 98.6శాతం సీఎంఆర్ పూర్తి చేశారు. గతేడాదిలో సీఎంఆర్ ఇవ్వకుండా అవకతవకలకు పాల్పడిన మిల్లర్లలో ఇద్దరికి నోటీసులు ఇవ్వగా మరో మిల్లుపై కేసు నమోదు చేశారు. సివిల్‌సప్లయిస్ అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అవకతవకలకు పాల్పడిన మిల్లర్లకు ధాన్యాన్ని కేటాయించకుండా నిలిపివేశారు. దీంతో ఈ సారి లక్ష్యాన్ని సాధించారు.

మిల్లర్ల జాప్యానికి మూల్యం..!

కొన్నేళ్లుగా మిల్లర్ల నుంచి సీఎంఆర్ సేకరణలో జాప్యం జరుగుతోంది. ప్రభుత్వం పలుమార్లు గడువు పొడిగిస్తూ అవకాశం కల్పించినా మిల్లర్లు నిర్లక్ష్యాన్ని చేరడం లేదు. జిల్లాలో ఏటా పౌరసరఫరాల సంస్థ 66 మిల్లులకు ధాన్యాన్ని మిల్లింగ్ కోసం ఇస్తోంది. ధాన్యం మరాడించాక 67శాతం బియ్యాన్ని పౌరసరఫరాల సంస్థకు అందించాల్సి ఉంటుంది. కానీ గడువులోగా బియ్యాన్ని అప్పగించడంలో మిల్లర్లు కాలం వెళ్లదీసే వారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం వీటిపై ప్రత్యేక దృష్టి సారించి లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్‌ను సేకరించారు.

సీఎంఆర్ 98శాతం పూర్తి

- శ్రీలత, జిల్లా మేనేజర్, పౌరసరఫరాల సంస్థ



జిల్లాలో ఇప్పటి వరకు సీఎంఆర్ 98శాతం పూర్తిచేశాం. బియ్యాన్ని గోదాములకు చేర్చడం కూడా పూర్తి కావస్తోంది. అక్టోబరు వరకు నూరు శాతం బియ్యాన్ని సేకరిస్తాం. రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీకి ఎలాంటి ఆటంకం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

యాసంగిలో 86 శాతం

2024-25 ఏడాది వానాకాలంలో 98శాతం, యాసంగిలో 86శాతం సీఎంఆర్ సేకరణ పూర్తయింది. యాసంగి సీజన్‌లో మిల్లర్లకు మొత్తం 4,56,167 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించగా అందులో 3,06,446.600 మెట్రిక్‌టన్నుల బియ్యం రావాల్సి ఉండగా ఇప్పటివరకు 2,55,839.149 మెట్రిక్‌టన్నుల బియ్యాన్ని అప్పగించారు. ప్రతి నెలా రేషన్‌షాపులు, ఇతర అవసరాలకు సన్నబియ్యం పంపిణీ చేసేందుకు వీలుగా బియ్యం నిల్వలు సిద్ధం చేస్తున్నారు. దీంతో బియ్యాన్ని మిల్లర్లు పక్కదారి పట్టించకుండా గడువులోపు అందించేలా అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఇదే సమయాన మిల్లుల్లో ధాన్యం, బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా పెట్టారు.

2024-25 వానాకాలం, యాసంగిలో మిల్లులకు కేటాయించిన ధాన్యం, సీఎంఆర్ సేకరణ ఇలా..

ధాన్యం కేటాయింపు	సీఎంఆర్	ఇప్పటివరకు సరఫరా	బ్యాలన్స్ (మెట్రిక్ టన్నుల్లో)
2,95,609	1,98,069.600	1,95,228.406	2,841.194
	యాసంగి		
1,60,558	1,08,377	60,610.743	47,766.258
4,56,167	3,06,446.600	2,55,839.149	50,607.452

ఆ లేఖ రాసింది మేమే..

- భూస్వామ్య పెత్తందారులు ఖబడ్దార్
- ఆడియో టేపుతో పాటు లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ
- 10 రోజుల్లో మూడో లెటర్..
- భయాందోళనలో మండల వాసులు
- అసలు ఈ విప్లవ ఎవరన్నదానిపై చర్చ


విప్లవ పేరుతో విడుదలైన లేఖ

చర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు పార్టీలేఖలు చర్ల మండలంలో కలకలం సృష్టిస్తున్నాయి. 10రోజుల వ్యవధిలో మూడో లెటర్ విడుదల చేయడం సర్వత్రా చర్చనీయాంశమైంది. తాజాగా భూస్వామ్య పెత్తందారులు ఖబడ్దార్ అంటూ, మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ విప్లవ పేరుతో బుధవారం మండలంలో ఓ లేఖ విడుదలైంది. దాంతో పాటు 10సెకన్ల ఆడియో టేపును కూడా మావోయిస్టులు విడుదల చేశారు. విప్లవ సంతకంతో ఉన్న లేఖలో, ఉద్యమానికి ఊపిరి పోస్తూ, అమరులైన ఉద్యమకారులకు విప్లవ జోహార్లని, గత వారం క్రితం అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ విప్లవ పేరుతో విడుదల చేసిన లేఖను తమ పార్టీనే విడుదల చేసిందని పేర్కొన్నారు. అలాగే బూటకపు లేఖలు.. ఉద్యమాలు చేసే విప్లవ కారులకు రావని పేర్కొన్నారు. ఇంకా కొంత మంది రాజకీయ బ్రోకర్లు, విలేకరుల ముసుగులో ఉన్న నీచులూ మా పార్టీపై అసత్య ప్రచారం చేస్తూ ద్రోహులుగా మారారని, వారికి ప్రజా కోర్టులో శిక్ష తప్పదని, అమరుల త్యాగాలకు బదులు తీర్చుకుంటామని విప్లవ లేఖలో పేర్కొన్నారు. అలాగే లేఖతో పాటు 10సెకన్ల ఆడియో టేపును కూడా లేఖతో పాటు విడుదల చేశారు. ఆ ఆడియోలో మహిళా లాల్ సలాం అంటూ మొదలు పెట్టి గత కొద్ది రోజుల క్రితం లేఖ రాసింది తామేనని పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం ఇదే విప్లవ పేరుతో లేఖ విడుదలైంది. మండలంలోని పలువురు పద్దతి మార్చుకోవాలని హెచ్చరించారు. కాగా ఆ లేఖ సరైంది కాదని భూటకమంటూ లచ్చన్న పేరుతో మరో లేఖ వచ్చింది. ఇదే క్రమంలో విప్లవ ఈ లేఖను విడుదల చేశారు.

ఎవరీ విప్లవ?

విల్లవ పేరుతో ఇప్పటికి చర్ల మండలంలో రెండు లేఖలు విడుదలయ్యాయి. తాజాగా లాల్ సలాం అంటూ ఆమె ఆడియో విడుదల చేసింది. దీంతో మావోయిస్టు పార్టీ నుంచే అసలైన లేఖ వచ్చినట్లు తెలుస్తోంది. అయితే విప్లవ ఎవరు అని ఇప్పుడు అందరిమదిలో ప్రశ్నలు మొదలవుతున్నాయి. గతేడాది వరకు భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారాజు కమిటీ కార్యదర్శి ఆజాద్ పేరిట లేఖలు మీడియాకు లేఖలు వచ్చేవి, ఆపరేషన్ కగార్ నేపథ్యంలో ఆజాద్ పేరిట లేఖలు నిలిచిపోయాయి. తాజాగా వారం క్రితం విప్లవ పేరుతో మొదటగా లేఖ విడుదలైంది. అయితే మావోయిస్టు పార్టీలో కమిటీలు మారినట్లు లేఖ ద్వారా అర్థమవుతోంది. విప్లవ పేరుతో మాట్లాడిన మహిళ హిందీ, గోండు భాషలో మాట్లాడటం చూస్తే ఆమె చత్తీస్‌గఢ్‌కు చెందిన మహిళగా తెలుస్తోంది.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తాం

కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి సతీష్


సమావేశంలో మాటాల్లడుతున్న సతీష్

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రూ.10 వేలు లాభాల బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని బుధవారం కొత్తగూడెంలోని బంగ్లోస్ వద్ద జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి పెద్దిబోయిన సతీష్ తెలిపారు. గతేడాది రూ.5వేలు బోనస్‌ను కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన యాజమాన్యం ఈ ఏడాది కేవలం 500 మాత్రమే పెంచడం జరిగిందని ఇది కార్మికుల మనోభావాలను దెబ్బతీసిందని తెలిపారు. సింగరేణి యాజమాన్యం సైతం కార్మికుల శ్రమను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ లాభాల బోనస్ పెంచాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు అన్ని జేఏసీగా ఏర్పడి ఉద్యమాలకు సిద్ధమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, నాగమ్మ, మల్లేష్, లోకేష్, సురేష్, తారా, లక్ష్మీ, రోజ పాల్గొన్నారు.

ఐదు నెలల గర్భిణులకు టిఫాస్కానింగ్ చేయాలి

అదనపు డీఎంహెచ్‌వో సైదులు


రోగులతో మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌వో సైదులు

మణుగూరు టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మారుమూల మండలాల ఆదివాసీ గిరిజన గ్రామాల్లో నివాసముంటున్న గిరిజన కుటుంబాల్లో మహిళలు ఎవరైనా గర్భిణీలు ఉంటే వారికి ఐదు నెలల నిండిన వారికి తప్పని సరిగా టిఫా స్కానింగ్ చేయాలని ఐటీడీఏ ఏడీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు సూచించారు. బుధవారం మణుగూరులోని 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఐటీడీఏ ఉత్తర్వుల మేరకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రికి వచ్చే రోగులతో మాట్లాడారు. ఈ మేరకు వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలించారు. టిఫా స్కానింగ్ పనితీరును పరిశీలించి మాట్లాడారు. వర్షకాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, ఇతర వైరల్ ఫీవర్స్ విజృంభించే అవకాశం ఉన్నందున మండలాల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు ఇంటింటికీ తిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలను చేపట్టాలని సూచించారు. జ్వరాలకు సంబంధించి అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని డెంగీ మరణాలు సంభవించకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో చైతన్య, డీపీఎంవో పాయం శ్రీనివాస్, ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకుడు డాక్టర్ సునీల్, హెచ్‌ఈవో గొంది వెంకటేశ్వర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గర్భిణి ప్రసవ వేదన

- రహదారి లేక గ్రామానికి చేరుకోని 108 వాహనం
- జెడ్డీకట్టి 2 కిలో మీటర్లు మోసుకెళ్లిన కుటుంబీకులు
- భద్రాద్రి జిల్లా పినపాక మండలం సుందరయ్యనగర్‌లో ఘటన


జెడ్డీపై గర్భిణీని మోసుకొస్తున్న కుటుంబసభ్యులు

పినపాక, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రహదారుల సౌకర్యం లేక నేటికీ ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు ఏజెన్సీ గ్రామాల దుస్థితికి అద్దం పడుతున్నాయి. ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యమే ఈ ఘటన. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని జానంపేట పంచాయతీ పరిధిలోని సుందరయ్యనగర్ గ్రామానికి చెందిన వలస ఆదివాసీ మహిళ జ్యోతికి బుధవారం పురిటినొప్పులు వచ్చాయి. రహదారి సౌకర్యం లేని ఆ గ్రామానికి అంబులెన్స్ వచ్చే అవకాశం లేకపోవడంతో జ్యోతి కుటుంబ సభ్యులు ఆమెను జెడ్డీ కట్టి మోసుకొచ్చారు. భూపతిరావుపేట గ్రామం వరకు మాత్రమే 108 వాహనం వచ్చే సౌకర్యం ఉండడంతో.. జ్యోతిని సుందరయ్యనగర్ నుంచి భూపతిరావుపేట వరకు సుమారు రెండుకిలోమీటర్లు జడ్డీలో మోసుకొచ్చారు. అక్కడి నుండి 108 వాహనంలో జానంపేట పీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. ఆమెకు సాధారణ ప్రసవం జరగగా, మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నట్టు జానంపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు శృతి తెలిపారు. తమ గ్రామానికి ఇప్పటికైనా రహదారి సౌకర్యం కల్పించి, తమ ఇబ్బందులను తప్పించాలని సుందరయ్య నగర్ గ్రామస్థులు కోరుతున్నారు.

మీకు రామానుగ్రహం కలుగుగాక

ఇకపై దాతలకు వాట్సాప్ ద్వారా సందేశాలు
త్వరలోనే అమలు చేసేందుకు సన్నాహాలు
అక్టోబరు 22న దాతలకు సత్కారం


భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం

భద్రాచలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని దర్శించిన భక్తులు స్వామివారి శాశ్వత పూజలు, ఉచిత నిత్యాన్నదానం తదితర కార్యక్రమాలకి చెల్లింపులు చేస్తుంటారు. ఈ క్రమంలో తమ కుటుంబ సభ్యుల్లో ఒకరి పేరిట జన్మదినం లేదా వివాహ వార్షికోత్సవం ఇలా పలుసందర్భాల పేరిట దాతలు దేవస్థానంకు విరాళాలు అందజేస్తుంటారు. అయితే శాశ్వత పూజలు, ఉచిత నిత్యాన్నదానానికి విరాళం ఇచ్చిన భక్తులకు ఇకపై వాట్సాప్ ద్వారా సందేశాన్ని పంపే యోచనలో దేవస్థానం అధికారులు ఉన్నారు. ఇందుకోసం ఇప్పటికే దాతల సమాచారంను కంప్యూటీకరణ చేపడుతున్నట్లు తెలిసింది. ఈ ప్రక్రియ పూర్తయిన అనంతరం దాతలకు వారు ఎంచుకు న్న రోజున అన్నదానం నిర్వహిస్తున్నట్లు సమాచారం వాట్సప్ ద్వారా అందజేయనున్నారు. అలాగే శాశ్వత నిత్యకల్యాణానికి రుసుం కట్టిన భక్తులకు 15 రోజుల ముందే సమాచారం అందించి పలాన రోజున మీ పేరుమీద శాశ్వత కల్యాణం అంటూ సమాచారం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈ విధం గా చేయడం ద్వారా భక్తుల నుంచి సానుకూ ల స్పందన రావడంతో పాటు ఇతర భక్తులు భారీగా విరాళాలు అందించేందుకు అవకాశం ఉంటుందని దేవస్థానం వర్గాలు భావిస్తున్నా యి. గతంలో లేఖల ద్వారా సమాచారం ఇచ్చే వ్యవస్థ ఉండగా అది కొద్దికాలంగా అనుకున్నంత రీతిలో అమలు కాకపోవడంతో తాజా గా వచ్చిన సాంకేతికతను వినియోగించుకొని భద్రాద్రి దేవస్థానం మరింతగా డిజిటల్ సేవలను భక్తులకు అందించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఈ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమయ్యేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని దేవస్థానం అధికారులు పేర్కొంటున్నారు.ఇదిలా ఉండగా భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతిఏటా లక్ష రూపాయలకు పైగా చెల్లించిన దాతలను సముచితంగా సత్కరించేందుకు దేవస్థానం సిద్ధమవుతోంది. ఈ సమయంలో స్వామివారికి దాత ల పేరిట ప్రత్యేక పూజలు, వేద ఆశీర్వచనం, అల్పాహారం, స్వామివారి అన్నప్రసాదం, ఉచిత వసతి అందించనున్నారు. గతంలో దేవస్థానం ఈవోగా బాధ్యతలు నిర్వహించిన ఎల్. రమాదేవి ఈ ప్రక్రియకు రెండేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. కాగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన దేవస్థానం ఈవో కే.దామోదర్ రావు సైతం ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ అక్టోబర్ 22న దాతలకు ఘన సత్కారం చేసేందుకు ఏర్పాట్లు చేసున్నారు. సుమారు 1200మందికి ఈ విధంగా సమాచారం పంపేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

అవినీతికి మళ్లీ అవకాశాలు!




ఖమ్మం మునిసిపల్ కార్యాలయం, జయనగర్ ప్రధాన రహదారి వెంట చెత్త

పెరిగిన అధికారులు, తగ్గిన పారిశుధ్యం
ఆదాయ సేకరణలో జాప్యం.. ఆపై గోప్యం
నేడు కేఎంసీ కలెక్టర్ అనుదీప్ రివ్యూ..

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంలో ఒక్క అవార్డు రాలేదు. 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల కాలేదు. ఉదయం కమిషనర్ కార్యాలయానికి రాకుంటే మధ్యాహ్న భోజన విరామానికి ఇంటికి వెళ్లిన ఉద్యోగులు తిరిగి కార్యాలయం వైపు కన్నెత్తి చూడటం లేదు. ఇలా ఖమ్మం నగరపాలక సంస్థ పరిపాలనపై తీవ్ర విమర్శలు వెలువడుతున్నాయి. అయితే గత నెలలో కేఎంసీలో రివ్యూ నిర్వహించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మరో నెల రోజుల్లో తిరిగి సమావేశం నిర్వహిస్తానని పనితీరు మెరుగుపర్చుకోవాలని ఆదేశించారు. కానీ ఆ మేరకు కేఎంసీలో సిబ్బంది పనితీరులో ఎటువంటి మార్పు రాలేదని కార్పొరేటర్లు, ప్రజలు వాపోతున్నారు.

పారిశుధ్యం, ఆర్థిక ఇబ్బందులు

రాష్ట్రస్థాయిలో ఎంతో ఘనకీర్తి కలిగిన ఖమ్మం నగరపాలక సంస్థ ఇప్పుడు కనీసం పారిశుధ్య నివారణలో ఒక్క అవార్డుకు కనీస పోటీ కూడా ఇవ్వలేకపోయింది. ఈ మేరకు ప్రతిపక్షాల నుంచి అనేక విమర్శలు ప్రభుత్వం ఎదుర్కొంది. కాగా ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు మున్సిపాలిటీలకు మంజూరు చేస్తూ జీవోను విడుదలచేసింది. కానీ అందులో ఖమ్మం నగరపాలక సంస్థ పేరు లేక పోవటంతో నిధులు వస్తాయా? రావా? అనే విషయంపై కార్పొరేటర్లు ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు క్రమ పద్ధతిలో వసూళ్లు జరగాల్సిన ఆదాయ సేకరణ జరగటంలేదని తెలుస్తోంది. వార్డు ఆఫీసర్లును సద్వినియోగం చేసుకోవటంలో అధికారులు సరైన కార్యచరణ జరగటం లేదని తెలుస్తోంది. ఆదాయ వసూళ్ల పూర్తికాకపోగా గోప్యంగా వ్యవహరించటంపై కేఎంసీ పనితీరుపై విమర్శలు వెలువడుతున్నాయి.

అవినీతికి మళ్లీ అవకాశాలు

ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో గత పదేళ్లుగా కంప్యూటర్ ఆపరేటర్ల తీరు కారణంగా అవినీతి కార్యక్రమాలు చోటు చేసుకున్నాయి. ఖాళీ ఇళ్ల స్థలాలకు ఇంటి నెంబర్లు కేటాయించి.. చివరకు ఉద్యోగాలు పోగొట్టుకున్నారు. వారిపై ఒక వైపు విచారణ కొనసాగుతుండగానే మరోవైపు తిరిగి వారిని విధుల్లోకి తీసుకుంటున్నారు. ఎంక్వైరీ పూర్తి కాకుండానే విధుల నుంచి తొలగించిన వారిని తిరిగి తీసుకోవటం వెనుక పంచాయతీశాఖ నుంచి పొరుగు సేవలపై వచ్చిన ఉద్యోగి వత్తిడి ఉన్నట్లు విమర్శలు వెలువడుతున్నాయి.

కంప్యూటర్ ఆపరేటర్లు తప్పిదాలతో బాధితులు..

కేఎంసీలోని కంప్యూటర్ ఆపరేటర్లు అజాగ్రత్తల కారణంగా గతంలో ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడంలో ఇబ్బందులు ఎదురైనాయి. మున్నేరు వరద బాధితులకు ప్రభుత్వ పరిహారం అందించటంలో వివాదాలు చోటుచేసుకున్నాయి. అర్హత కలిగిన వారికి అందలేదని ఇప్పటికీ బాధితులు కేఎంసీ చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను ఆన్‌లైన్ నమోదులో అనేక తప్పిదాలు చేస్తున్నారు. ఆధార్ నెంబర్లుతో పాటుగా లబ్ధిదారుల రిజర్వేషన్ల నమోదులోను తప్పిదాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. దీంతో తొలి విడతలో ఓ మహిళకు దక్కాల్సిన ఇందిరమ్మ ఇళ్లు దక్కలేదు. కంప్యూటర్ ఆపరేటర్లు చేసిన తప్పిదానికి ఆ మహిళ ప్రతి రోజూ కేఎంసీ కార్యాలయానికి వస్తుంది. అలాగే కొందరు బాధితులు కూడా ప్రదీక్షణలు చేస్తున్నారు.

పెరిగిన అధికారులు...

ఖమ్మం నగరపాలక సంస్థకు గతంలో కంటే అధికారుల సంఖ్య పెరిగింది. కార్యాలయ పర్యవేక్షణకు మేనేజరు నుంచి డిప్యూటీ మేనేజరు లాంటి అనేక క్యాడర్ ఉద్యోగాల్లో అధికారులు పెరిగారు. డివిజన్లలో కార్మికుల సంఖ్యను పెంచి కేఎంసీపై ఆర్థిక భారం మోపారు. కానీ ఆమేరకు పర్యవేక్షణ పెరగలేదు. డివిజన్లలో పారిశుధ్య లోపం నుంచి కేఎంసీ కార్యాలయంలో ఉద్యోగులకు కేటాయించిన పని గంటల మేరకు పని వేళల నిర్వాహణ వరకు అనేక విమర్శలు వెలువడుతున్నాయి. విలీన డివిజన్లలో పారిశుధ్యం మరింత లోపంగా మారింది. కేవలం కమిషనర్ పారిశుధ్య పరిశీలనకు వచ్చిన సమయంలో కేఎంసీ డీసీ నుంచి ఏఎంసీ, పారిశుధ్య పర్యవేక్షకుల వరకు హడావుడీ చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

నేడు కేఎంసీలో కలెక్టర్ రివ్యూ

కేఎంసీ కార్యాలయంలో గురువారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమావేశం నిర్వహించనున్నారు. గత నెలలో జరిగిన సమావేశంతో పాటుగా ఖమ్మం నగరంలో పారిశుధ్య లోపం, ఆదాయ వసూళ్ల, ఉద్యోగుల పనితీరుపై సమీక్షించనున్నారు. ఈ మేరకు కావాల్సిన ఏర్పాట్లు కమిషనర్ అభిషేక్ అగస్త్య చేశారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న సుచరితదేవి

వైరా, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జె.హేమంతకుమార్, పలువురు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం సాళ్ల పద్ధతిలో పత్తిసాగుపై జరిగిన వర్క్‌షాపులో డాక్టర్ జె.హేమంతకుమార్, వైరా కృషివిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుచరితదేవి, మధిర ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణిదేవి మాట్లాడారు. పత్తిలో సూక్ష్మ పోషక లోపం, అధిక వర్షాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పత్తి పంట తర్వాత అపరాల సాగుపై పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రస్తుత తరుణంలో పంటలకు వ్యాపించే చీడపీడలు వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ టి.పావని, పణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పాడి రైతుల అభిప్రాయాల సేకరణ

బోనకల్, ముష్టికుంట్ల గ్రామాలను సందర్శించిన ఎన్‌డీడీబీ బృందం
ఇందిరా డెయిరీ ఏర్పాటులో భాగంగా చకచకా పనులు


మహిళల అభిప్రాయాలను తెలుసుకుంటున్న ఎన్‌డీడీబీ బృందం

బోనకల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కలల ప్రాజెక్టుగా, దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటున్న ఇందిరా డెయిరీకి సంబంధించి మండలంలోని బోనకల్, ముష్టికుంట్ల గ్రామాలను బుధవారం ఢిల్లీ ఎన్‌డీడీబీ (నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు) బృందసభ్యులు డాక్టర్ జయవర్ధన్, సీజోలు సందర్శించారు. పశుసంపద, పాల శీతలీకరణ కేంద్రాల ఏర్పాటు, స్వయం సహాయక సంఘాల సభ్యుల భాగస్వామ్యం, పాల సేకరణ, ఐఎండీ ప్లాంట్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. మహిళా పాడి రైతులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, వారి అభిప్రాయాలను సేకరించారు. పాడి ద్వారా ఆర్థిక స్వావలంబన చేకూరుతుందని మహిళలు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇప్పటికే మొదటి విడత కింద 125 మంది లబ్ధిదారులు 250 గేదేలను కొనుగోలు చేశారు. ఈ మేరకు ఒక్కొక్క పాడి రైతుకు రూ.1.60లక్షల సబ్సిడీ వచ్చింది. ఇందిరా డెయిరీ ఏర్పాటుకు డిప్యూటీ సీఎం శ్రీకారం చుట్టి, తమ జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని, ఆయనకు రుణపడి ఉంటామని మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమలో సెర్ప్ ప్రాజెక్టు మేనేజర్ సతీష్, అడిషనల్ డీఆర్డీవో జయశ్రీ, డీపీఎం శ్రీనివాస్, ఏపీవో నరసింహ, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆరో బెటాలియన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అడిషనల్ డీజీపీ సంజయ్‌కుమార్ జైన్

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీదేవిపల్లి మండలంలోని ఆరో బెటాలియన్‌లో పలు అభివృద్ధి పనులకు అడిషనల్ డీజీపీ సంజయ్‌కుమార్ జైన్ బుధవారం శంకుస్థాపన చేశారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు బెటాలియన్ పరిసర ప్రాంతాలను వాటి వివరాలను అడిషనల్ డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా బెటాలియన్ ప్రాంతంలో డైనింగ్ హాల్, జిమ్‌రూమ్, పార్కింగ్ షెడ్, బుద్ధ స్టాచ్యూ, ఓపెన్ జిమ్, ఎక్స్టెన్షన్ స్పోర్ట్స్ గ్రౌండ్, ఎస్ఆర్‌డీ ఆఫీసులు అకామిడేషన్ హాల్, ఎంట్రన్స్ గేట్ వంటి అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి, అదనపు కమాండెంట్ డి.వెంకటేశ్వరరెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్‌లు, సింగరేణి వెల్ఫేర్ జీఎం బి.వి.కిరణ్‌కుమార్, ఎక్స్‌ప్లోరేషన్ జీఎం బి.శ్రీనివాస్‌రావు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

సైబర్ దాడిలో మోసపోయిన గిరిజన రైతు

బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు మాయం



సైబర్ నేరగాడు రైతు ఫోనుకు పంపిన నకిలీ ఐడీ కార్డు

జూలూరుపాడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ గిరిజన రైతు సైబర్ నేరగాడి చేతిలో మోసపోయాడు. ఈ సంఘటన మండలంలోని సాయిరాం తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఈ మేరకు బాధిత రైతు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాయిరాం తండాకు చెందిన గిరిజన రైతు భూక్యా కిషన్‌కు జూలూరుపాడులోని ఎస్‌బీఐ బ్యాంకులో ఖాతా ఉంది. వ్యవసాయ పెట్టుబడుల నిమిత్తం తన ఖాతాలో రూ.10,460లు ఉంచాడు. ఈ క్రమంలో మూడు రోజులుగా గుర్తు తెలియని వ్యక్తి కిషన్‌కు ఫోన్‌చేసి హెడ్‌ఆఫీస్ నుంచి ఫోన్ చేస్తున్నామని తెలిపాడు. బ్యాంక్ ఖాతాకు సంబంధించి పూర్తి వివరాలు లేకపోటంతో మీ ఖాతా నిలుపుదల అవుతుందని, బ్యాంకు ఖాతా తెరిచే సమయంలో వివరాలను పూర్తిగా ఇవ్వలేదని, పూర్తి వివరాలు ఇవ్వాలని అడిగాడు. దీంతో సదరు రైతు బ్యాంకుకు వెళ్లి వివరాలు తెలుసుకుంటానని చెప్పాడు. మరోసారి సైబర్ నేరగాడు ఫోన్ చేయగా రైతు ఇంట్లో లేకపోవటంతో అతని భార్య లీల ఫోన్‌ఎత్తి మాట్లాడింది. తన పేరు ఆకాశ్‌వర్మని ముంబాయి హెడ్‌బ్రాంచ్‌లో పనిచేస్తున్నానని చెప్పి తన ఐడీ కార్డును వాట్సాప్ చేశాడు. ఇది చూసిన రైతు భార్య సైబర్ నేరగాడు నిజమని నమ్మి.. అతను అడిగిన దానికి సమాదానం చెబుతుండగా.. మీ భర్త బ్యాంక్ ఖాతాకు సంబంధించిన వివరాలను పూర్తిచేస్తున్నానని, సెల్‌కు వచ్చిన ఓటీపీ నెంబర్ చెప్పాలని అడిగాడు. దీంతో ఆమె ఓటీపీ నెంబర్‌ను అతనితో చెప్పటంతో క్షణాల్లోనే సైబర్ నేరగాడు ఖాతాలో ఉన్న రూ.10 వేల నగదును డ్రా చేసినట్లుగా ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఆ మెసేజ్ చూసి ఆమె ఖంగుతిన్నది. వెంటనే విషయాన్ని భర్తకు చెప్పింది. దీంతో రైతు జూలూరుపాడులోని బ్యాంకు వద్దకు వచ్చి విషయాన్ని బ్యాంకు అధికారులకు తెలియజేశాడు. దీంతో వారు ఇది సైబర్ నేరగాడు పని అని, సైబర్ నేరగాడు పంపిన ఐడీకార్డు నకిలీదని చెప్పారు. దీంతో రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. ఎరువుల కొనుగోలు కోసమని ఖాతాలో డబ్బును దాచుకుంటే దానిని సైబర్ నేరగాడు దోచుకోవడంతో సదరు రైతు లబోదిబోమన్నాడు. జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

బాత్రూంలో జారిపడి వ్యక్తి మృతి

చుంచుపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బాత్రూంలో జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తగూడెం టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామవరం ప్రాంతానికి చెందిన మధుసూదన్ (42) పేయింటింగ్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో పనికి వెళ్లే ముందు స్నానం చేసేందుకు బాత్రూంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. దీంతో గొంతు భాగంలో తీవ్రగాయం అవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు 108 వాహనంలో కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధుసూదన్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ ప్రతాప్ తెలిపారు.

ట్రాన్స్‌కో డివిజన్ కార్యాలయం.. విభజన

- మధిరకు డీఈ కార్యాలయం మంజూరు
- విజయదశమికి ప్రారంభించేలా చర్యలు?



వైరాలోని ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం

వైరా, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో టీజీ ఎన్‌పీడీసీఎల్ (ట్రాన్స్‌కో), డివిజనల్ ఇంజనీర్(డీఈ) కార్యాల యాల విభజనకు ఆ సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలోనే డిప్యూటీ సీఎం అయిన రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిథ్యం వహిస్తున్న మధిరలో నూతనంగా డివిజనల్ ఇంజనీర్ కార్యాలయ ఏర్పాటుకు ఆదేశా లు జారీ చేశారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని వచ్చేనెల ఒకటో తేదీన మధిర డీఈ కార్యాలయాన్ని ప్రారం భించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

ఖమ్మం జిల్లాలో ఇకమీదట అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ట్రాన్స్‌కో డీఈ కార్యాలయాల ఏర్పాటుకు ఈ ఉత్తర్వుల్లో స్పష్టతనిచ్చారు. ప్రస్తుతం ఖమ్మంజిల్లాలో ఖమ్మం టౌన్, ఖమ్మం రూరల్, సత్తుపల్లి, వైరా డీఈ కార్యాలయాలున్నాయి. ఇకమీదట నూతనంగా మధిర డీఈ కార్యాలయం ఏర్పాటవుతుంది. పైన పేర్కొన్న నాలుగు డీఈ కార్యాలయాల పరిధిలోని మండలాలను విభజించి మధిర డీఈ కార్యాలయాన్ని ఏర్పాటుచేస్తూ ఆ సంస్థ గతనెల 20వ తేదీన ఉత్తర్వులిచ్చింది. ఇప్పటివరకు వైరా డివిజన్ పరిధిలో ఉన్న మధిర నియోజకవర్గంలోని బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాలు అలాగే ఖమ్మం రూరల్ డీఈ పరిధిలో ఉన్న ముదిగొండ మండలం, ఖమ్మం టౌన్ డీఈ పరిధిలో ఉన్న చింతకాని మండలాన్ని మధిర డీఈ కార్యాలయం పరిధిలోకి తీసుకువచ్చారు. మధిర, ఎర్రుపాలెం మండలాల పరిధిలోని నాలుగు సెక్షన్లతో మధిర ఏడీఈ కార్యాలయం పనిచేస్తుంది. ఇప్పుడు నూతనంగా బోనకల్‌ను సబ్‌డివిజన్ కార్యాలయంగా ఏర్పాటుచేశారు. బోనకల్, చింతకాని మండలాల్లోని విద్యుత్ సెక్షన్లు ఈ సబ్‌డివిజన్ పరిధిలో ఉంటాయి. ముదిగొండ మండలం రెండు సెక్షన్లతో సబ్‌డివిజన్‌గా ఏర్పాటుచేశారు. మధిర, ముదిగొండల్లో ఈఆర్వో కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఇవి మొత్తం మధిర డీఈ పరిధిలో పనిచేస్తాయి. ముదిగొండలో ఏర్పాటుచేసిన ఈఆర్వో కార్యాలయాన్ని కామేపల్లి మండలం కొత్తలింగాల నుంచి ఇక్కడకు తరలించారు. ఇకపోతే వైరా డివిజన్ కార్యాలయం నుంచి బోనకల్, మధిర, ఎర్రుపాలెం మండలాలను తప్పించారు. ఇప్పుడు వైరా నియోజకవర్గ పరిధిలోని వైరా, ఏన్కూరు, కారేపల్లి, కొణిజర్ల మండలాలను వైరా డీఈ పరిధిలోకి తీసుకువచ్చారు. ఇప్పటివరకు కొణిజర్ల, కారేపల్లి మండలాలు ఖమ్మం టౌన్ పరిధిలో, ఏన్కూరు సత్తుపల్లి పరిధిలో ఉన్నాయి.

ఇప్పుడు ఆ డీఈ కార్యాలయాల నుంచి విభజించి వైరా డీఈ కార్యాలయం పరిధిలోకి తీసుకువచ్చారు. వైరా, కొణిజర్ల మండలాల్లోని నాలుగు సెక్షన్లతో ఒక సబ్‌డివిజన్ ఈఆర్వో కార్యాలయం ఏర్పాటుచేశారు. నూతనంగా ఏన్కూరు మండలంలోని తిమ్మారావుపేటలో సబ్‌డివిజన్ ఈఆర్వో కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ఏన్కూరు, కారేపల్లి మండలాల్లోని మూడు సెక్షన్లు ఈ సబ్‌డివిజన్ ఈఆర్వో కార్యాలయం పరిధిలో ఉంటాయి. ఖమ్మం టౌన్ పరిధిలో ఖమ్మం టౌన్-1, ఖమ్మం టౌన్-2, ఖమ్మం టౌన్-5లను ఒక సబ్‌డివిజన్ ఈఆర్వో కార్యాలయంగా ఏర్పాటుచేశారు. ఖమ్మం టౌన్-2 పరిధిలో ఖమ్మం టౌన్-3, ఖమ్మం టౌన్-4, ఖమ్మం అర్బన్, మమతా రోడ్డును సబ్‌డివిజన్‌గా ఏర్పాటుచేశారు. రఘునాథపాలెం కేంద్రంగా రఘునాథపాలెం, బల్లేపల్లి, మంచుకొండ, కొత్తలింగాల సెక్షన్లతో సబ్‌డివిజన్ కార్యాలయం, ఈఆర్వో కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ఖమ్మం రూరల్ డీఈ పరిధిలో ఏదులాపురం సబ్‌డివిజన్ పనిచేస్తుంది. దీని కింద ఏదులాపురం, పల్లెగూడెం, ఆరెంపుల, టీఆర్‌పాలెం సెక్షన్లతో ఈఆర్వో కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. కూసుమంచి సబ్‌డివిజన్‌ను ఏర్పాటుచేశారు. దీని పరిధిలో కూసుమంచి, నేలకొండపల్లి, రాజేశ్వపురం, బచ్చోడు, పాలేరు సెక్షన్లతో కూసుమంచి కేంద్రంగా ఈఆర్వో కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. సత్తుపల్లి డీఈ పరిధిలో సత్తుపల్లి సబ్‌డివిజన్ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. దీని పరిధిలో సత్తుపల్లి, గంగారం, వేంసూరు, రాయుడుపాలెం సెక్షన్లు పనిచేస్తాయి. పెనుబల్లి సబ్‌డివిజన్‌లో పెనుబల్లి, లంకపల్లి, కల్లూరు సెక్షన్లు పనిచేస్తాయి. సత్తుపల్లి కేంద్రంగా ఈఆర్వో కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. తల్లాడ సబ్‌డివిజన్ పరిధిలో తల్లాడ, కుర్నవల్లి, పెద్దకోరుకొండి సెక్షన్లను చేర్చారు. తల్లాడ కేంద్రంగా ఈఆర్వో కార్యాలయం పనిచేస్తుంది. ఈవిధంగా జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ట్రాన్స్‌కో డీఈ కార్యాలయాలను విభజించారు.

గోదావరి తీరప్రాంతాల్లో పోలీసుల గస్తీ


టీ కొత్తగూడెం గోదావరి తీర ప్రాంతంలో పోలీసుల గస్తీ

పినపాక, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టు పార్టీ ఆవిర్భావ వారోత్సవాల నేపథ్యంలో ఏజెన్సీలో పోలీసులు గోదావరి తీర ప్రాంతాలపై డేగకన్ను వేశారు. గోదావరి నిండుకుండలా రెండువైపులా కాలినడక సాగించేంత వీలు లేకుండా ప్రవహిస్తుండడంతో, మావోయిస్టులు ఆవాసం కోసం దాటవచ్చు లేదా విధ్వంసక ఘటనలకు పాల్పడవచ్చని పోలీస్ నిఘావర్గాల హెచ్చరికల నేపథ్యంలో ఏడూళ్లబయ్యారం సర్కిల్ పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు. రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉండే మండలంలోని భూపతిరావుపేట, టీ కొత్తగూడెం, చింతలబయ్యారం, సింగిరెడ్డిపల్లి, రావిగూడెం గోదావరి సరిహద్దు గ్రామాల్లో పోలీసు పహరాతో గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాల్లో నూతన వ్యక్తులు, అనుమానితులు సంచారంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అసాంఘీక శక్తులకు సహకరించి, ఇబ్బందులు పడొద్దని, ప్రశాంతమైన జీవనానికి విఘాతం కలిగించే వ్యక్తులు, సమూహాల కదలికలు, సంచారంపై సమాచారం ఇవ్వాలని ఏడూళ్లబయ్యారం సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్‌లు కోరారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలోనే హత్య

వివరాలు వెల్లడించిన కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్


సమావేశంలో మాట్లాడుతున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం గణేష్ బస్తీ ప్రాంతానికి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి గుబ్బల రామ్మోహన్‌రావు హత్య వివాహేతర సంబంధం నేపథ్యంలో జరిగినట్లు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రామ్మోహన్‌రావు ఈనెల 22న రాత్రి తన ఇంట్లో భోజనం చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మాస్కులు ధరించి మారణాయుధాలతో ఇంట్లోకి ప్రవేశించి దాడి చేశారు. దీంతో భయాందోళనకు గురైన ఆయన ఇంట్లో నుంచి బయటకి వెళ్లిగా దుండగులు విచక్షణా రహితంగా సుత్తితో దాడికి పాల్పడి హత్యచేశారు. ఈ హత్యకు పాల్పడిన రామవరానికి చెందిన మహమ్మద్ షహీర్, వాసంపల్లి వంశీలను అరెస్టు చేశారు. ఈ సమావేశంలో కొత్తగూడెం త్రీటౌన్ సీఐ శివప్రసాద్, టూటౌన్ సీఐ ప్రతాప్, వన్‌టౌన్ సీఐ కరుణాకర్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యం

మృతుడు ఖమ్మంలో మహిళను పొడిచిన కేసులో నిందితుడు


రవి మృతదేహం

కొణిజర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనుమా నస్పద స్థితిలో మృతి చెందిన వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మండల పరిధిలోని విక్రం నగర్‌లో బుధవారం జరిగింది. ఎస్ఐ సూరజ్ తెలిపి న వివరాల ప్రకారం రఘునాధపాలెం మండలం కోటపాడుకు చెందిన బలంతు రవి(35) అనే వ్యక్తి కొణిజర్ల మండలం విక్రంనగర్ గ్రామంలోని మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ కింద అనుమానస్పదంగా మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై సిబ్బందితో వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఒంటిపై ఎటువంటి గాయాలు లేవని ఇక్కడకి ఎలా వచ్చాడు? ఎలా మృతి చెందాడు అర్థంకావడంలేదని ఎస్ఐ తెలిపారు. పూర్తి వివరాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. మృతుడు ఈనెల 22న ఖమ్మం నగరంలోని ఓ మహిళపై కత్తితో దాడి చేసిన సంఘట నలో నిందితుడని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

భవనంపై నుంచి పడి టెక్నీషియన్ మృతి


సాగర్ (ఫైల్)

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): భవనంపై నుంచి కింద పడి టెక్నీషియన్ మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుజాతనగర్ మండలానికి చెందిన బత్తిని సాగర్(35) డీటీహెచ్ సర్వీస్ ఫిట్టింగ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో కొత్తగూడెం రైల్వే క్వార్టర్స్ నందు డిష్ ఫిట్టింగ్ చేసేందుకు వచ్చి భవనం రెండో అంతస్తులో ఫిట్టింగ్ చేస్తున్న క్రమంలో కాలుజారి కింద పడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. భవనంపై నాచు ఉండడం వలన కాలుజారి ఉంటుందని తెలుస్తుంది. ఈ సమాచారం తెలుసుకున్న వన్ టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, నాలుగేళ్ళ కూతురు ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. సాగర్ అకాల మరణంతో సుజాతనగర్ మండలంలో విషాదా ఛాయలు అలుముకున్నాయి.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఖమ్మంఅర్బన్ సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆటోమోటార్ కార్మికులను ప్రభుత్వం ఆదుకునే చర్యలు చేపట్టాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే లాల్‌మియా డిమాండ్ చేశారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన జిల్లాకమిటీ సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం నగర పరిధికి అనుగుణంగా ఆటో స్టాండ్ల ఏర్పాటుకు పూనుకోవాలన్నారు. ఆటో వర్కర్స్‌యూనియన్ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యూనియన్ జిల్లానాయకులు ఎడ్లపల్లి ఉపేందర్, ములపల్లి లక్ష్మీనారాయణ, ఉప్పలయ్య, నాగరాజు, కుమార్ పాల్గొన్నారు.

వర్షంతో ఇళ్లల్లోకి చేరిన నీరు

తిరుమలాయపాలెం, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): మండలలోని ఎర్రగడ్డ గ్రామపంచాయతీ శివారు గోపాలపురం ఎస్సీకాలనీ వాసులు ఇళ్లలో డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షపు నీరు చేరుతుంది. కాలనీలో సీసీరోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు. వర్షాకాలం వస్తే వర్షపునీరు బయటకు పోకుండా ఉంటుంది ఈనేపథ్యంలో వర్షపునీరు ఇళ్లలోచేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో సైడ్‌డ్రెయినేజీలు నిర్మించాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు.



గోపాలపురంలో ఇళ్లలోకి చేరిన వరద

'టీరా'తో హెపటైటిస్-బి నివారణ

జిల్లా వైద్యాధికారి కళావతీబాయి

ఖమ్మంకలెక్టరేట్,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): టీరా ద్వారా హెపటైటిస్-బిని నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.కళావతిబాయి, ఖమ్మం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ తెలిపారు. బుధవారం ఖమ్మం మెడికల్ కళాశాలలో టీకాల కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ హెపటైటిస్-బి అనేది కాలేయాన్ని ప్రభావితం చేసే ప్రమాదకరమైన వైరల్ వ్యాధి అని అన్నారు. దీనినుంచి రక్షణ పొందడానికి టీకా అత్యంత సురక్షితమైన, ప్రభావవంతమైన మార్గమన్నారు. అనంతరం హెల్త్ సిబ్బందికి టీకాకార్యక్రమాన్ని ప్రారంభించారు. మెడికల్ కాలేజ్ విద్యార్థులకు, ఆఫీస్ సిబ్బందికి డైరెక్టర్ ఆఫ్ హెల్త్, హెల్త్ కేర్ ప్రొవైడర్లకు డీఎంహెచ్‌వో కళావతిబాయి హెపటైటీస్-బీ టీకాలను వేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శంకర్, అదనపుడీఎంహెచ్‌వో వెంకటరమణ, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం నరేందర్, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, వైద్యులు రమాదేవి, డాక్టర్ సమతారాణి, డాక్టర్ ప్రీతి, తదితరులు పాల్గొన్నారు. బుధవారం నాటి వరకు 811 మందికి హెపటైటిస్ టీకాను వేసినట్లు అధికారులు తెలిపారు.



హెపటైటిస్ టీకాలు వేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కళావతిబాయి

ఆరోగ్య కేంద్రాలను తనిఖీ

ప్రజల నాణ్యమైన వైద్యసేవలు అందించి వారిని ఆరోగ్యవంతులు చేయడమే వైద్యఆరోగ్యశాఖ ప్రధాన లక్ష్యమని జిల్లా వైద్యాధికారి కళావతిబాయి అన్నారు. బుధవారం ఆమె యూపీహెచ్‌సీ.ముస్తఫానగర్ పరిధిలోని తప్పలగూడెం బస్తీదవఖానను తనిఖీ చేశారు. వారి ఆరోగ్య పరిస్థితులు, అక్కడ అందుతున్న సేవల గురించి అడిగితెలుసుకున్నారు. ముఖ్యంగా డెంగీ పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పాత మునిసిపాలిటీ ఆమ్(ఏఏఎం) సెంటర్‌ను సందర్శించారు. వైద్య కార్యక్రమాలను సమీక్షించారు. సీనియర్ సిటిజెన్లకు, గర్భిణులకు సరైన వసతులు కల్పించాలని కోరారు. ఆమె వెంట డీఎంవో డాక్టర్ వెంకటరమణ ఆయా ఆరోగ్యకేంద్రాల మెడికల్ ఆఫీసర్లున్నారు.

అంతా గోప్యంగా..

(5వ పేజీ తరువాయి)

వెలువెత్తుతున్నాయి. పైరవీ కారులకు సర్దుబాటులో మంచి స్థానాలు కేటాయించారని సంఘాలు విమర్శిస్తున్నాయి. ఏమండలం ఉపాధ్యాయులను అదే మండలంలో సర్దుబాటు చేయాల్సి ఉండగా, ఆ మండలంలో ఉపాధ్యాయులు దొరక్కపోతే పక్క మండలం నుంచి తీసుకోవాలి. ఇలా సర్దుబాటు ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా దానికి భిన్నంగా మండలాలకు మండలాలు దాటించి 60,70కిలోమీటర్లలోని ఉపాధ్యాయులను ఖమ్మంలో సర్దుబాటు చేశారని ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.

వారికి మినహాయింపేదీ?

వికలాంగుడైన రిక్కా బజార్ గణిత ఉపాధ్యాయుడిని అవసరం లేకపోయినా వెలుగుమట్లకు సర్దుబాటు చేశారు. అక్కడ 75 మంది పిల్లలున్నారు. అయినా వికలాంగ ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయడంలో ఉన్న ఆంతర్యమేంటో జిల్లా అధికారులకే తెలియాలన్న చర్చ జరుగుతోంది. అదేవిధంగా పెనుబల్లి మండలం చింతగూడెం వికలాంగ ఉపాధ్యాయుడిని తాళ్లపెంటకు పంపారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులను సర్దుబాటు నుంచి మినహాయించాల్సి ఉన్నా ఇవ్వకుండా.. కల్లూరు మండలంలో వారిని కూడా సర్దుబాటు చేశారు. ఇంకా అనేక మండలాల్లో ఎంవోలు వారికి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయులకు మంచి స్థానాలు దక్కే విధంగా సర్దుబాటు ప్రక్రియను చేపట్టారనే విమర్శలు వెల్లవెత్తుతున్నాయి. వీటిపై జిల్లా విద్యాశాఖ సమీక్షించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సర్దుబాటులన్నింటినీ రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రోటరీ నగర్‌లో 300మంది విద్యార్థులు ఉండగా అక్కడ హిందీ ఉపాధ్యాయుడిని కేటాయించాల్సి ఉన్నా కేటాయించలేదు. కూసుమంచి, ఎన్‌ఎస్‌కెనాల్ పాఠశాలలు జిల్లాలోనే అత్యధిక నమోదు కలిగి ఉన్నాయి. అక్కడ అవసరం మేరకు ఉపాధ్యాయులను కేటాయింపు చేయలేదు. రాజేంద్ర నగర్, బాలాజీనగర్, పాలేరు పాఠశాలల్లో గతం నుంచి పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉన్నా వీరిని కాదని, నూతన ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా జరిగిన సర్దుబాట్లలో మచ్చుకు కొన్ని..

- కల్లూరు మండలం చిన్నకోరుకొండి ఆంగ్ల ఉపాధ్యాయురాలిని అదే మండలం ఎర్రబోయినపల్లిలో సర్దుబాటు చేయాల్సి ఉండగా, ఖమ్మంలోని జూబ్లీపుర పాఠశాలకు సర్దుబాటు చేశారు.
- ఖమ్మం ఎన్‌ఎస్పీ కాలనీలో ఆంగ్ల ఉపాధ్యాయుడు అవసరం ఉండగా అతనిని కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి పంపారు.
- ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ స్కూల్ హిందీ ఉపాధ్యాయుడిని వేంసూరు మండలం దుద్దిపూడికి సర్దుబాటు చేశారు.
- వేంసూరు మండలం దుద్దిపూడిలోని హిందీ ఉపాధ్యాయుడిని ఖమ్మం నగరం రిక్కాబజార్ పాఠశాలకు సర్దుబాటు చేశారు.
- తల్లాడ మండల ఉపాధ్యాయురాలిని నిబంధనలకు విరుద్ధంగా ఖమ్మం రోటరీ నగర్ ప్రాథమిక పాఠశాలకు పంపారు.
- బోనకల్లు మండలం ఆళ్లపాడు స్కూల్ హిందీ ఉపాధ్యాయురాలిని నేలకొండపల్లికి పంపారు.
- పెనుబల్లి మండలం కోండ్రుపాడు హిందీ ఉపాధ్యాయుడిని బోనకల్లు మండలం అల్లపాడు నకు సర్దుబాటు చేశారు.
- కారేపల్లి నందు పనిచేస్తున్న ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలిని ఖమ్మం నగరంలోని బాలాజీ నగర్ పాఠశాలకు పంపారు.

రిజర్వేషన్లపై తుది కసరత్తు!

(5వ పేజీ తరువాయి)

సమాచారం. ఏ మండలాల్లో ఏప స్థానాలు ఎవరికి ఖరారయ్యాయనే విషయంలో ఉత్కంఠ కొనసాగుతోంది.

- ఎంపీపీ స్థానాల్లో కూడా ఈ సారి బీసీలకు అవకాశం దక్కనుంది. 2019లో ఎస్సీలకు 6, ఎస్టీలకు 6, ఇతరులకు 8 కేటాయించారు. అప్పట్లో బీసీలకు సీట్లు దక్కలేదు. అయితే ఈ సారి బీసీలకు ఎంపీపీల్లో కనీసం 4 స్థానాల వరకు రిజర్వేషన్ దక్కనున్నట్లు సమాచారం. అయితే వీటిపై అధికారికంగానే వెల్లడించాల్సి ఉంది. 2011 జనాభా లెక్కల ఆధారంగా వీటికి రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఖరారు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. జడ్పీ, మండల పరిషత్ అధ్యక్ష స్థానాలకు రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్ల స్థాయిలో చేపట్టారు. ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు.. పేదల ఆత్మగౌరవానికి ప్రతీకలు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. రాబోయే వారం రోజుల్లో యూరియా సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందన్నారు. ఈకార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ హరినాథ బాబు, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బండి జగదీష్, మాజీ సర్పంచ్ రవి, కాంగ్రెస్ నాయకులు దావూద్, తమ్మినేని నవీన్, పంతులు నాయక్, వీరభద్రం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు







పూజలు చేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ, బతుకమ్మ ఆడుతున్న మేయర్, మహిళా కార్పొరేటర్లు, అధికారులు, బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మలు ఎత్తుకున్న వద్దిరాజు, కందాళ, తాత మధు

ఖమ్మంకార్పొరేషన్,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం సాయంత్రం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో కేఎంసీ కార్యాలయంలో మెప్మా ఆర్పీలు, హౌజ్ కీపింగ్ కార్మికులు బతుకమ్మలను పేర్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ పునుకొల్లు నీరజ బతుకమ్మ వద్ద ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, కార్పొరేటర్లు గజ్జల లక్ష్మీ, రావూరి కరుణ, ఆళ్ల నిరీష, చిరుమామిళ్ల లక్ష్మీ, పెమ్మా వీడీ నళినీ పద్మావతి, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుంధర, ఉద్యాన అధికారి బెల్లం రాధిక ఆర్పీలతో కలిసి బతుకమ్మ నృత్యాలు చేశారు. ఆటలతో పాడి పాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, ఈఈ కృష్ణలాల్, ఏవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఖమ్మంఖానాపురంహవేలి: దేవినవరాత్రుల వేడుకలలో భాగంగా మూడో రోజు బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఖమ్మం నగరంలో స్థంభాద్రి లక్ష్మీనరసింహస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో 21వ వార్షిక శరన్నవరాత్రుల వేడుకలు జమ్మిబండవద్ద వైభవంగా నిర్వహిస్తున్నారు.. అమ్మవారు అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్థంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అమ్మవారు ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో ధైర్యలక్ష్మీ అమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు.రాపర్తినగర్‌లో మట్టితో తయారుచేసిన దుర్గాదేవిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఖానాపురంలో విశాలాక్షీ నవరాత్రుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నగరంలోని శివశక్తి భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి మండపం వద్ద మహా అన్నదానం నిర్వహించారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో..
హాజరైన ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం నగరంలోని జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ తాతామధుసూదన్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఖమ్మంరూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, బి.వీరన్న,ఉన్నం బ్రహ్మయ్య, దిండిగల రాజేందర్, బొమ్మెర రాంమూర్తి, మాజీఎంపీపీ బెల్లం ఉమ, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య పలువురు నాయకులు పాల్గొన్నారు.



న్యూవిజన్‌లో..



ఖానాపురంలో..



శ్రీచైతన్యలో..



క్రియేటీవ్ పాఠశాలలో

పలువురిని పరామర్శించిన వద్దిరాజు

కూసుమంచి, సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల మృతిచెందిన పలు కుటుంబాలను రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పరామర్శించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. కూసుమంచి మండలం గోపాలరావుపేటలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఇంటూరిశేఖర్ తల్లి భద్రమ్మ మృతిచెందగా నివాళులు అర్పించారు. ఖమ్మంరూరల్ మండలం గుదిమళ్లలో ఇటీవల మృతిచెందిన బండారు సూరయ్య చిత్రపటానికి అంజలి ఘటించారు.ఎంపీ వెంట మున్నూరు కాపుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకులగాంధీ, బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం ఉన్నారు.

కులనిర్మూలనపై చైతన్యం పెంపొందించాలి

మాస్‌లైన్ నాయకుడు హన్మంతరావు

కూసుమంచి,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కులనిర్మూలన చైతన్యం పెంపొందించేందుకు కృషిచేయాలనిసీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకులు తిమ్మిడి హన్మంతరావు తెలిపారు. కులనిర్మూలనపై పాలేరులో సదస్సు నిర్వహించారు. అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలన్నారు.కార్యక్రమంలో నాయకులు శివలింగం, ఆజాద్, పోటు నాగేశ్వరరావు, చాపల సత్యనారాయణ పాల్గొన్నారు.

సమ్మె కాలపు వేతనాలు చెల్లించాలి

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షకులుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల, ఉపాధ్యాయులకు సమ్మె కాలపు వేతనం చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా కమిటి డిమాండ్ చేసింది. బుధవారం సంఘం కార్యాలయంలో జిల్లా ఆఫీస్‌బేరర్ల సమావేశంలలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, రంజాన్ మాట్లాడారు. సమానపనికి సమాన వేతనం చెల్లించాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులకు కల్పించిన అన్నిసౌకర్యాలు సమగ్ర శిక్ష ఉద్యోగులకు కల్పించాలని డిమాండ్ చేశారు.

సమగ్ర యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

వైరా,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జె.హేమంతకుమార్ పేర్కొన్నారు. వైరాలోని కృషివిజ్ఞాన కేంద్రంలో బుధవారం సాళ్ల పద్ధతిలో పత్తిసాగుపై జరిగిన వర్క్‌షాపులో జె.హేమంతకుమార్, శాస్త్రవేత్తలు టి.సుచరితదేవి, కె.రుక్మిణిదేవి పత్తిలో సూక్ష్మ పోషకలోపంపై పలు సూచలే చేశారు.

అకాడమిక్ కౌన్సెలర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రాల్లో కౌన్సెలింగ్, తరగతులు బోధించేందుకు అర్హులైన కౌన్సిలర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రాంగణ అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ బి.వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. బోధనానుభవం, పీహెచ్‌డీ, నెట్,సెట్, సంబంధిత పీజీలో 55శాతం మార్కులు కలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హతలు కలిగిన అకడమిక్ కౌన్సిలర్స్ విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో అక్టోబరు10లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు అధ్యయన కేంద్రాంలో సంప్రదించాలన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డీఎం



ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా మంగళవారం మేడా శివప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డిపో ఆర్టీసీ ఉద్యోగులు ఆయన్ను అభినందనలు తెలిపారు. మహబూబాద్ డిపో మేనేజర్ గా పనిచేస్తూ ఆయన ఖమ్మం డిపో మేనేజర్‌గా బదిలీపై వచ్చారు. గతంలో ఖమ్మం డిపో మేనేజర్‌గా పనిచేసిన దినేశ్ కుమార్ కామారెడ్డికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగులందరికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తానన్నారు దసరా సందర్భంగా ప్రయాణికులకు సరిపడా బస్సులను అందుబాటులో ఉంచుతామని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే కందాళ పరామర్శ

ఖమ్మంరూరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలను పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. జలగంనగర్, రూరల్ మండలంలోని పోన్నేకల్లు, కొండాపురం, గూడురుపాడు, మంగళగూడెం, పోలేపల్లి గ్రామాల్లో పర్యటించారు. మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మాజీజడ్పీటీసీ సభ్యులు యండపల్లి వరప్రసాద్, మండలపార్టీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీ వైస్ ఎంపీపీ దరగయ్య, మంకెన నాగేశ్వరరావు, మట్టా వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, ఉదయ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కందాళ

వైద్యానికి ఎన్ఆర్ఐ ఆర్థికసాయం

కూసుమంచి,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి):మండలంలోని ధర్మాతండాలో రోడ్డుప్రమాదంలో గాయపడి అచేతనంగా ఉన్న జర్పుల సింధు వైద్యఖర్చుల నిమిత్తం ఎన్ఆర్ఐ అభిషేక్ రూ.50 వేలు అందించారు.2023లో ఎంసెట్ ప్రవేశ పరీక్ష రాసి బైక్‌పై తిరిగివస్తుండగా రోడ్డుప్రమాదం చోటుచేసుకుంది.ఈప్రమాదంలో సింధుగా గాయపడగా, సోదరుడు సందీప్ మృతిచెందాడు. అప్పటినుంచి సింధు చికిత్స పొందుతోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సింధు తండ్రి పరుశురాం ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబం ఇబ్బందులు చూసి ఎన్ఆర్ఐ అభిషేక్ రూ.50 వేలు అందించారు. ఈమొత్తాన్ని తన మిత్రుల ద్వారా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి జర్పుల లాలూప్రసాద్, వెంకట్, నారాయణ, భద్రు, తారాచంద్, సునీల్, పూల్‌సింగ్, నాగరాజు పాల్గొన్నారు.



సింధుకు నగదు అందజేస్తున్న దృశ్యం

యూబీఐ గ్రాహక్ సేవా కేంద్రం ప్రారంభం

ఎర్రుపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం గ్రామంలో గల యూబీఐ బ్యాంక్ గ్రామీణ గ్రాహక్ సేవా కేంద్రాన్ని ఆ గ్రామ బ్రాంచి ద్వారా బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల సౌలభ్యాన్ని గ్రామీణ మారుమూల ప్రాంతాలకు విస్తరింపజేయాలనే లక్ష్యంతో బ్యాంకు సంబంధిత కార్యకలాపాలను ఖాతాదారులకు మరింత సౌకర్యవంతంగా చేయడానికి కస్టమర్ సర్వీస్ పాయింట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ సేవా కేంద్రం ద్వారా అన్ని బ్యాంకింగ్ సంబంధిత సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు. ఏదైనా లావాదేవీని బ్యాంకు సంబంధిత కార్యకలాపాలకు వినియోగదారులు ఇకపైబ్యాంక్‌కు రావల్సిన అవసరంలేదన్నారు.

ఖాళీ కుర్చీలతో ఎంపీడీవో కార్యాలయం

» అధికారులు రాక.. ముందుకు సాగని ప్రజా సంక్షేమ కార్యక్రమాలు


కల్లూరు మండల పరిషత్ కార్యాలయం



కల్లూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో కీలకమైన అధికారులు లేక ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. కొంతకాలంగా ఈ కార్యాలయంలో కీలకమైన బాధ్యతలు నిర్వహించే ఎంపీఓ, సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ అధికారుల లేనందున వారి స్థానాల్లో ఖాళీ కుర్చీలు వెక్కిరిస్తున్నాయి. దీంతో ఇక్కడ కార్యాలయంలో ఎంపీడీవో ఒక్కరు మాత్రమే బాధ్యతలు నిర్వహిస్తూ పనిభారంతో సతమతమవుతున్నారు. ఇటీవల కాలంలో ఇందిరమ్మ గృహాల బిల్లుల, గ్రామ పంచాయితీల అభివృద్ధితోపాటుగా పారిశుధ్యం, పలు ప్రజా సంక్షేమ కార్యక్రమాల పనితీరుపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కరువైందని చెప్పవచ్చు. ప్రభుత్వ పరంగా జరగాల్సిన అభివృద్ధి పనులు ముందుకు సాగని పరిస్థితి. తమ అవసరాల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజానీకానికి జవాబుదారి తనం చెప్పే అధికారుల లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఖమ్మం జిల్లా లోనే కల్లూరు మండలం పెద్దది. డివిజన్ కేంద్రంగా విస్తరించింది. ఇంత స్థాయిలో ప్రాముఖ్యత గల కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో కొంత కాలంగా కీలక అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్న జిల్లా స్థాయి అధికార యత్రాంగం ఏ మాత్రం దృష్టిసారించని పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రంలో త్వరంలో స్థానిక సంస్థల ఎన్నికలు కూడా సమీపిస్తుండగా ఇలా గ్రామ పంచాయితీల వారిగా ఇతరత్ర పరంగా సమీక్షలు, సన్నాహక కార్యక్రమాలు చేపట్టాలన్న ఇబ్బందికరంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నత అధికార యంత్రాగం స్పందించి కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలోపై విధంగా ఖాళీగా ఉన్న కీలక అధికారుల పోస్టులను సత్వరమే భర్తీ చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.

మహిళలకే సంక్షేమ పథకాల అమలు

» కిష్టారం ఓసీలో సీఎం చిత్రపటానికి పూలాభిషేకం

» సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి


బతుకమ్మతో ఆడిపాడుతున్న ఎమ్మెల్యే దంపతులు



సత్తుపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకే అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తూ వస్తోందని, రేవంత్ సర్కార్‌ను దీవించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి కోరారు. దసరా పర్వదినం సందర్భంగా సత్తుపల్లి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గర్ల్స్ హైస్కూల్ ఆవరణలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదటి మహిళ ప్రజాప్రతినిధిగా నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి వారి సంక్షేమం కోసం పనిచేస్తున్నామని, ఇటీవల 10వ తరగతి విద్యార్థినులకు సైకిళ్లను తమ సొంత ఖర్చులతో అందించామని, ప్రభుత్వం తరఫున కుట్టు మిషన్లను అందించామని, డ్వాక్రా మహిళలకు ఎన్నో పథకాలు అమలులో ఉన్నాయన్నారు. త్వరలోనే దసరా కానుకగా చీరెలను అందించనుండగా ఇందిరమ్మ ఇళ్లను సైతం మహిళల పేరుతోనే ఇస్తున్నామని, ఒక మహిళ బాగుపడితే కుటుంబం బాగుబడి సమాజం అభివృద్ధిలో ఉంటుందని, మీ దీవెనలు కలకాలం తమపై ఉండాలని ఆమె ఆకాంక్షించారు. మునిసిపల్ కమిషనర్ కె.నర్సింహా, ఎఫ్‌డీవో వాడపల్లి మంజుల, ఐసీడీఎస్ సీడీపీవో మెహరున్నీసా బేగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. అంతకముందు మండలంలోని కిష్టారం ఓసీలో సింగరేణి కాంట్రాక్టు కార్మికులతో కలసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలకు పూలాభిషేకంలో పాల్గొన్నారు.

రైతులకు క్లస్టర్ పరిధిలోనే యూరియా కూపన్లు

కారేపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రెవెన్యూ క్లస్టర్ల వారిగా రైతులకు యూరియా కూపన్లు పంపిణీ చేయడం జరుగుతందని మండల వ్యవసాయశాఖ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికారుల నుంచి సమాచారం వచ్చేనప్పుడే రైతువేదికల వద్దకు రైతులు వెళ్ళి కూపన్లు తీసుకోవాలని ప్రకటనలో తెలిపారు.

రేజర్లలో శతాధిక వృద్ధురాలి మృతి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నూరు పదుల వయసు దాటి ఓ వృద్ధులు అనారోగ్యంతో మృతిచెందిన సంఘటన సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చింతల సీతావరమ్మ (108) కొంతకాలంగా అనారోగ్యంతో బాదపడుతూ తుదిశ్వాస విడిచారు. మృతదేహాన్ని గ్రామస్థులు, పెద్దలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బీసీ బిడ్డల భవిష్యత్ కోసం నిరాహార దీక్ష


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్తుపల్లి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తాను చేస్తున్న ఈ దీక్ష తన కోసం కాదని, భవిష్యతు తరాల బీసీ బిడ్డల కోసమే ఈ నిరాహార దీక్ష చేపడుతున్నానని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు స్పష్టం చేశారు. బీసీల అభ్యున్నతికి ఈనెల 26న ఖమ్మంలోని కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్‌లో చేపట్టే ఆమరణ నిరాహార దీక్ష సన్నాహక సమావేశం బుధవారం సత్తుపల్లిలో నిర్వహించారు. ఈ దీక్షకు బీసీ బిడ్డలు పిలిస్తేనో, చెబితేనో కాదని తెలిసిన వెంటనే తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గ్రాండ్ మౌలాలీ, వినుకొండ కృష్ణ, కంటే అప్పారావు, వీరివాడ నాగభూషణం, టోపి శ్రీను, దుస్సా వెంకటేశ్వర్లు, మానుకోట ప్రసాద్, నాని, సురేష్, వెంకటేశ్వర్లు, ధర్మతేజ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే సండ్ర, కట్టా


కట్టాను అభినందిస్తున్న కేటీఆర్

కల్లూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌ను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, కల్లూరు మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ బుధవారం హైదారాబాద్‌లోని వారి నివాస గృహంలో మార్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ రాజకీయ పరిస్థితి, పార్టీ పరంగా విస్తరించాల్సిన పలు అంశాలతోపాటుగా ప్రత్యేకించి కల్లూరు మండల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్‌ను కేటీఆర్ శాలువలతో సత్కరించి అభినందించారు. బీఆర్ఎస్ నాయకుడు పుసులూరి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ కమిటీలు రాజ్యాంగ బద్ధమా?'


మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

చింతకాని, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ పేర్కొన్నారు. ఆ పార్టీ సీనియర్ నాయకుడు కొండ్రు జానకి రామయ్య బుధవారం మండల పరిధిలోని పాతర్లపాడు వద్ద జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించగా ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ మండల కేంద్రం వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ధ పాలన కారణంగా రైతులు, నిరుపేదలు నష్టపోతున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులతో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయడంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మాత్రమే లబ్ధిపొందుతున్నారని సామాన్యులకు సంక్షేమ పథకాలు అందడంలేదన్నారు. అనంతరం పలు సమస్యలపై తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మధిర నియోజకవర్గ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, సామినేని రామారావు, రాచబంటి రాము, వత్సవాయి జానకిరాములు, వీరబాబు, రౌతు అప్పారావు, బీఆర్ఎస్ నాయకులు హనుమంతరావు, రమేష్, వెంకటరామారావు పాల్గొన్నారు.

పామాయిల్ గెలల సేకరణ కేంద్రం ఏర్పాటు చేయాలి


రైతు సదస్సులో మాట్లాడుతున్న బొంతు

బోనకల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బోనకల్‌లో పామాయిల్ గెలల సేకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘ జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఇక్కడ జరిగిన పామాయిల్ రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ.. పామాయిల్ సాగు చేయాలని చెప్పిన పాలకులు, వాటి పెంపకంలో రైతులకు వెన్నుదన్నుగా నిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఒక్క అధికారి మాత్రమే ఉద్యానవనశాఖలో విధులు నిర్వహిస్తుండగా, అన్ని గ్రామాల్లో రైతులకు ఎలా సేవలందిస్తారని ప్రశ్నించారు. బోనకల్ మండలంలో పామాయిల్ సాగు గణనీయంగా పెరిగిందని, గెలల విక్రమానికి గానూ వైరాకు వెళ్లాలంటే రైతులకు అదనపు ఖర్చు అవుతోందన్నారు. ఈ సమావేశంలో పామాయిల్ రైతు సంఘ నాయకులు తుంబూరు మహేశ్వర్‌రెడ్డి, కె. పుల్లయ్య, వెంకట్రావు, చక్రదర్‌రెడ్డి, దొండపాటి నాగేశ్వరరావు, రామ్మోహన్‌రావు, పూర్ణచందర్‌రావు, కరివేద పిచ్చయ్య, తన్నీరు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో క్రిస్టియన్ భవన పనులు ప్రారంభం

» కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు దయానంద్ విజయ కుమార్

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో రూ.2కోట్ల నిధులతో చేపట్టనున్న క్రిష్టియన్ భవన నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని క్రీస్తుసంఘం ప్రార్థనా మందిరంలో నిర్వహించిన ఎస్‌సీసీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల సమయంలో మాట ఇచ్చినట్లుగానే 5మండలాల్లో క్రిష్టియన్ భవనాలను నిర్మిస్తామని, పాస్టర్లు అందరికీ ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని, ఎన్నికల సమయంలో మాకు అండగా నిలిచినందుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇదే విధంగా ఎల్లప్పుడూ కార్యకర్తలు తమకు అండగా ఉంటూ ఆశీర్వాదం అదించాలని కోరారు. అలవాల కరుణాకర్, రేవ.సామ్యూల్ జాషువా గెడ్డం, హోప్ జోసెఫ్, పింగలి సామేలు, శ్యామ్‌సన్, పీ.రవికిరణ్, యాకూబ్, ప్రకాశ్రాజ్, వరప్రసాద్, నోబెల్, సుధాకర్, క్లైమెంట్, దేవసహాయం, వేణుపాల్, జొన్నలగడ్డ రాజు, యేసుపాదం, వసంత్ పాల్గొన్నారు.

గొప్ప లక్ష్యాలను నిర్ధేశించుకుని ముందుకు సాగాలి

మధిర రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి):. విద్యార్థులు గొప్ప లక్ష్యాలను నిర్ధేశించుకుని వాటికనుగుణంగా చదువుతూ ముందుకు సాగాలని మధిర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సాంబయ్య సూచించారు. బుధవారం ఇక్కడ ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రయోగశాలలో అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరికరాలను, గ్రంథాలయ సదుపాయాలను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. అందుకోసం కళాశాలలో ఉన్న అనుభవం కలిగిన అధ్యాపకులు అన్నివేళలా సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శాఖాధిపతులు వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

మత్స్యకార సంఘం నుంచి ఇద్దరి బహిష్కరణ


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

సత్తుపల్లి, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): గత పాలకవర్గంలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు రుజువు కావటంతో అప్పటి అధ్యక్ష, కార్యదర్శిలు తాటి వెంకటేశ్వరరావు, పొదిలి నరిసింహారావులను బహిష్కరించినట్లు బేతుపల్లి గంగారం మత్స్యకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షలు ఊకే కన్నారావు, కొండా జయరాజు తెలిపారు. బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 12 ఏళ్లుగా సంఘాన్ని అడ్డుపెట్టుకొని వారు చేసిన అక్రమాలపై సర్వసభ్య సమావేశంలో చర్చించి రెండుసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదన్నారు. సంఘ నియమ నిబంధనలకు లోబడి సదరు సభ్యుల సభ్యత్వాన్ని శాశ్వతంగా తొలిగిస్తున్నట్లు వారు స్పష్టం చేశారు. గిరిజన మత్స్యకార సహకార బేతుపల్లి గంగారంను మార్చి బేతుపల్లి గంగారం మత్స్య సహకార సంఘంగా చేయటంతో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే 90 శాతం రాయితీని కోల్పోయామన్నారు. అలాగే ఎస్టీ సబ్‌ప్లాన్ నుంచి 2014 లో 132 మంది సభ్యులకు వచ్చిన రూ.6.60 లక్షల మొత్తాన్ని నిధులు వారు దిగమింగారని ఆరోపించారు. ఇంకాను రూ. 10 లక్షల విలువైన చేపలను చెరువులో వదిలేందుకు సొసైటీ సభ్యులు తీర్మానం చేసినా ఆ ఇద్దరు వ్యక్తులు అడ్డుకోవటంతో చేపలకు ఆక్సిజన్ అందక అవి చనిపోయ్యాయన్నారు. డైరెక్టర్లు కాక రామచద్రరావు, పొదిలి శ్రీనివాసరావు, నర్సింహారావు, రాంబాబు, కొర్సా మహాలక్ష్మి, రమేష్,మల్లేష్ పాల్గొన్నారు.

అంతా గోప్యంగా..

(5వ పేజీ తరువాయి)

వెలువెత్తుతున్నాయి. పైరవీ కారులకు సర్దుబాటులో మంచి స్థానాలు కేటాయించారని సంఘాలు విమర్శిస్తున్నాయి. ఏ మండలం ఉపాధ్యాయులను అదే మండలంలో సర్దుబాటు చేయాల్సి ఉండగా, ఆ మండలంలో ఉపాధ్యాయులు దొరక్కపోతే పక్క మండలం నుంచి తీసుకోవాలి. ఇలా సర్దుబాటు ప్రక్రియ చేపట్టాల్సి ఉండగా దానికి భిన్నంగా మండలాలకు మండలాలు దాటించి 60, 70 కిలోమీటర్ల లోని ఉపాధ్యాయులను ఖమ్మం నగర కేంద్రంలో సర్దుబాటు చేశారని ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.

వారికి మినహాయింపేదీ?

వికలాంగుడైన రిక్కా బజార్ గణిత ఉపాధ్యాయుడిని అవసరం లేకపోయినా వెలుగుమట్లకు సర్దుబాటు చేశారు. అక్కడ 75 మంది పిల్లలున్నారు. అయినా వికలాంగ ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయడంలో ఉన్న ఆంతర్యమేంటో జిల్లా అధికారులకే తెలియాలన్న చర్చ జరుగుతోంది. అదేవిధంగా పెనుబల్లి మండలం చింతగూడెం వికలాంగ ఉపాధ్యాయుడిని తాళ్లపెంటకు పంపారు. స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులను సర్దుబాటు నుంచి మినహాయించాల్సి ఉన్నా ఇవ్వకుండా.. కల్లూరు మండలంలో వారిని కూడా సర్దుబాటు చేశారు. ఇంకా అనేక మండలాల్లో ఎంఈవోలు వారికి అనుకూలంగా ఉన్న ఉపాధ్యాయులకు మంచి స్థానాలు దక్కే విధంగా సర్దుబాటు ప్రక్రియను చేపట్టారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటిపై జిల్లా విద్యాశాఖ సమీక్షించి నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సర్దుబాటులన్నింటినీ రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రోటరీ నగర్‌లో 300మంది విద్యార్థులు ఉండగా అక్కడ హిందీ ఉపాధ్యాయుడిని కేటాయించాల్సి ఉన్నా కేటాయించలేదు. కూసుమంచి, ఎన్ఎస్‌కెనాల్ పాఠశాలలు జిల్లాలోనే అత్యధిక నమోదు కలిగి ఉన్నాయి. అక్కడ అవసరం మేరకు ఉపాధ్యాయులను కేటాయింపు చేయలేదు. రాజేంద్రనగర్, బాలాజీనగర్, పాలేరు పాఠశాలల్లో గతం నుంచి పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉన్నా వీరిని కాదని, నూతన ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు.

నిబంధనలకు విరుద్ధంగా జరిగిన సర్దుబాట్లలో మచ్చుకు కొన్ని..

● కల్లూరు మండలం చిన్న కోరుకొండి ఆంగ్ల ఉపాధ్యాయురాలిని అదే మండలం ఎర్రబోయినపల్లిలో సర్దుబాటు చేయాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా ఖమ్మం నగరంలోని జూబ్లీపుర పాఠశాలకు సర్దుబాటు చేశారు.

● ఖమ్మం నగర ఎన్ఎస్పీ కాలనీలో ఆంగ్ల ఉపాధ్యాయుడు అవసరం ఉండగా అతనిని కల్లూరు మండలం ఎర్రబోయినపల్లికి పంపారు.

● ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ స్కూల్ హిందీ ఉపాధ్యాయుడిని వేంసూరు మండలం దుద్దిపూడికి సర్దుబాటు చేశారు.

● వేంసూరు మండలం దుద్దిపూడిలోని హిందీ ఉపాధ్యాయుడిని ఖమ్మం నగరం రిక్కాబజార్ పాఠశాలకు సర్దుబాటు చేశారు.

● తల్లాడ మండల ఉపాధ్యాయురాలిని నిబంధనలకు విరుద్ధంగా ఖమ్మం రోటరీ నగర్ ప్రాథమిక పాఠశాలకు పంపారు.

● బోనకల్లు మండలం ఆళ్లపాడు స్కూల్ హిందీ ఉపాధ్యాయురాలిని నేలకొండపల్లికి పంపారు.

● పెనుబల్లి మండలం కొండ్రుపాడు హిందీ ఉపాధ్యాయుడిని బోనకల్లు మండలం ఆల్లపాడు నకు సర్దుబాటు చేశారు.

● కారేపల్లి నందు పనిచేస్తున్న ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలిని ఖమ్మం నగరంలోని బాలాజీ నగర్ పాఠశాలకు పంపారు.

ఎస్సీ కార్పోరేషన్ రుణాలను మంజూరు చేయాలి

» కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

బోనకల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పోరేషన్ ద్వారా అర్హులైన వారికి రుణాలను మంజూరు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఆ సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2018 నుంచి దళితులకు ఎస్సీ కార్పోరేషన్ ద్వారా రుణాలు అందడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 29వ తేదిన నారాయణపురంలో జరగనున్న తమ సంఘం మండల మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు నేముల పుల్లయ్య, గార్లపాటి రమేష్, ఉప్పర శ్రీను, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు.. పేదల ఆత్మగౌరవానికి ప్రతీకలు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. రాబోయే వారం రోజుల్లో యూరియా సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ హరినాథ బాబు, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బండి జగదీష్, మాజీ సర్పంచ్ రవి, కాంగ్రెస్ నాయకులు దావూద్, తమ్మినేని నవీన్, పంతులు నాయక్, వీరభద్రం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు

వైరా, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైరాలోని వాణీవివేకానంద విద్యాలయంలో బుధవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. స్కూల్ ప్రాంగణం బతుకమ్మలతో కళకళలాడింది. ఈ సందర్భంగా సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మలతో నృత్యాలు చేశారు. కరస్పాండెంట్ చుండూరి కోటేశ్వరరావు, డైరెక్టర్ చుండూరి వాణీ పర్యవేక్షించారు.


వాణీ వివేకానందలో బతుకమ్మలతో యాజమాన్యం, ఉపాధ్యాయులు


సత్తుపల్లిలో పేర్చిన బతుకమ్మతో మహిళలు

రిజర్వేషన్లపై తుది కసరత్తు!

(5వ పేజీ తరువాయి)

సమాచారం. ఏ మండలాల్లో ఏఏ స్థానాలు ఎవరికి ఖరారయ్యాయనే విషయంలో ఉత్కంఠ కొనసాగుతోంది.

● ఎంపీపీ స్థానాల్లో కూడా ఈ సారి బీసీలకు అవకాశం దక్కనుంది. 2019లో ఎస్సీలకు 6, ఎస్టీలకు 6, ఇతరులకు 8 కేటాయించారు. అప్పట్లో బీసీలకు సీట్లు దక్కలేదు. అయితే ఈ సారి బీసీలకు ఎంపీపీల్లో కనీసం 4 స్థానాల వరకు రిజర్వేషన్ దక్కనున్నట్లు సమాచారం. అయితే వీటిపై అధికారికంగానే వెల్లడించాల్సి ఉంది. 2011 జనాభా లెక్కల ఆధారంగా వీటికి రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఖరారు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. జడ్పీ, మండల పరిషత్ అధ్యక్ష స్థానాలకు రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్ల స్థాయిలో చేపట్టారు. ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి రిజర్వేషన్ల జాబితాల పై సంతకాలను చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

ప్రజారోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డిప్యూటీ సీఎం

» ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన బీఆర్ఎస్ బృందం

మధిర రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం పట్ల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వందపడకల ఆస్పత్రి భవనాన్ని గత ప్రభుత్వ హయాంలో నిర్మించినా ఇంతవరకు ప్రారంభించకపోవడం బాధాకరమని మాజీ జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మధిరలోని ప్రభుత్వ ఆస్పత్రిని బీఆర్ఎస్ నాయకుల బృందం సభ్యులు పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమల్‌రాజ్ మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.34కోట్లతో మధిరలో వందపడకల ఆస్పత్రిని నిర్మించిందని, ఆనాడు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభించలేకపోయామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా కానీ ఆసుపత్రిని ప్రారంభించలేదన్నారు. అనేక సందర్భాల్లో స్థానిక ప్రజలు, పలు రాజకీయపక్షాలు ఈ విషయాన్ని భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ఖమ్మం ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోందన్నారు. వెంటనే ఆసుపత్రిని ప్రారంభించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలన్నారు.

అంగన్‌వాడీల్లో పోషణ మాసోత్సవం

వైరా, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధిర సీడీపీవో జె.బాలత్రిపురసుందరి, వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సుచరితదేవి ముఖ్యఅతిథులుగా పాల్గొని పోషక విలువల గురించి వివరించారు. పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. తల్లులకు, అంగన్‌వాడీ టీచర్లకు బహుమతులు అందజేశారు. బతుకమ్మలాడి అలరించారు. సూపర్‌వైజర్లు సరిత, బీజాన్‌బీ, శ్రీలక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నిరుపేద విశ్వబ్రాహ్మణులకు వృత్తి పనిముట్ల పంపిణీ

వేంసూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలంలో విశ్వబ్రాహ్మణ కుటుంబాల్లో నిరుపేదలైన వారికి రూ.50వేల విలువైన వృత్తి పనిముట్లను తాటికొండ బ్రహ్మయ్య, నర్సమ్మ దంపతులు బుధవారం పంపిణీ చేశారు. కార్పెంటర్లకు వృత్తి పనిముట్లతోపాటు మహిళలకు కుట్టుమిషన్‌లు అందజేశారు. విశ్వబ్రాహ్మణసంఘం జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు, సిద్ధాంతి రామడుగు నర్సింహాచార్యులు, కోశాధికారి వెగ్గలం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.